ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 08.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 289 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



భారత్‌లోనే ఆడాలి 10



పదేళ్లు దోచుకున్నారు

అవాకులు, చెవాకులు పేలుతున్నారు

- ముందు ఇంటి గెలిచి రచ్చ గెలవాలి
- మీ కుటుంబ సభ్యులే మీ భాగోతం బయట పెడుతున్నారు
- ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కడతారు
- గోదావరి ఒడ్డున గల దేవాలయాలతో టెంపుల్ సర్క్యూట్
- భద్రకాళి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం
- వరంగల్‌పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ

జనవరి 7: పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచుకున్న మాజీ మంత్రి అవాకులు చేవాకులు పేలుతున్నారని, ముందు ఇంట గెలిచి రచ్చ గెలువాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అసెంబ్లీ సాక్షిగా మీ కుటుంబసభ్యులే మీ భాగోతం బయటపెడుతుంటే, అది సక్కదిద్దుకో చేతకాక, అవాకులు చేవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి రెఫరెండం అన్నారని, జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని 24వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. "సర్పంచ్ ఎలక్షన్లలో మా సత్తా ఏంటో తెలుస్తదన్నావు..రాష్ట్రం అంతటా ప్రజలు 70 శాతం కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చిన సర్పంచులను గెలిపించి మీకు వాత పెట్టారు.. మళ్లీ మున్సిపల్ ఎన్నికలు సెమీఫైనల్స్ అని ప్రగల్భాలు పలుకుతున్నారు.." అని అన్నారు. అధికారంలోకి వస్తానని మాజీ మంత్రి పగటికలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టడానికి, బీఆర్ఎస్ పార్టీని అడుగడుగున బొందపెట్టడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున గల దేవాలయాలతో టెంపుల్ సర్క్యూట్

ఆదిలాబాద్ నుండి భద్రాచలం వరకు గోదావరి ఒడ్డున గల ప్రధాన దేవాలయాలన్నింటిని ఒక టెంపుల్ సర్క్యూట్ గా ఏర్పాటు చేసి ఆధ్యాత్మికంగానే కాదు,

...:: మిగతా 2లో

19న మేడారానికి సీఎం రేవంత్ రెడ్డి

- మేడారం ఆధునీకరణ పనుల ప్రారంభం
- హైదరాబాద్ కి దీటుగా వరంగల్ అభివృద్ధి
- ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై మంత్రి పొంగులేటి సమీక్ష

...:: 2లో



అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

- ఏప్రిల్ లో రెండో విడత ఇస్తాం
- రానున్న రెండు సంవత్సరాలలో మరో రెండు విడతలు
- మార్చి 31 లోగా సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ పూర్తి చేస్తాం.

...:: 2లో

తెలంగాణ సమగ్రాభివృద్ధికి జాగృతి బ్లూప్రింట్

పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం

సంపూర్ణ అధ్యయనం సహా అన్ని కీలక అంశాలపై స్టడీ



- రాజకీయ పార్టీల రాజ్యాంగాల అధ్యయనానికి ప్రత్యేక కమిటీ
- ఈనెల 17న జాగృతి స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వనున్న కమిటీలు
- కమిటీల నివేదిక ఆధారంగా ప్రజాక్షేత్రంలోకి జాగృతి వెళ్లేలా నిర్ణయం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 7 : రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వికాసానికి, చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు, వివిధ వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోన్న తెలంగాణ జాగృతి రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అడుగులు వేయనున్నది. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం బ్లూ ప్రింట్ రూపొందించడంలో నిమగ్నమయ్యింది. జాగృతి జనంబాటలో భాగంగా ప్రజాక్షేత్రంలోకి వెళ్తోన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు ఉద్యమకారులు, వివిధ వర్గాల ప్రజల నుంచి తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వం అవసరమని సూచనలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రస్ఫుటింపజేసేలా రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తానని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్వీయ రాజకీయ శక్తిగా నిలుస్తామని కవిత

...:: మిగతా 2లో



ట్రంప్ ముందు చేతులు కట్టుకుంటారా?

: ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవడానికి "సార్, ప్లీజ్ నేను మిమ్మల్ని చూడొచ్చా?" అని బతిమాలుకున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

9



నెతన్యాహూకు మోడీ ఫోన్..

భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు బుధవారం ఫోన్ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని మోదీ ఎక్స్ లో వెల్లడించారు. వివిధ అంశాల్లో సహకారం, ప్రగతిపై ఇరు దేశాల ప్రధానులు హర్షం వ్యక్తం చేశారు.

9

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు



- సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి సిట్ నోటీసులు!
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారిడి నోటీసులు
- ప్రతిపక్ష నేతగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు కొండల్‌రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తింపు

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో ట్యాపింగ్‌కు గురైన 618 జాబితా నుంచి ఒక్కొకరిని విచారిస్తూ వస్తోంది. ప్రధానంగా సజ్జనార్ నేతృత్వంలోసిట్ ఏర్పాటు అయినప్పటి నుంచి దర్యాప్తు వేగం పెరిగింది. ఇందులో భాగంగానే గతంలో ట్యాపింగ్ బాధితులుగా ఉన్న 618 స్టేట్ మెంట్లను పరిశీలిస్తుంది. కొందరిని మరో సారి పిలిచి స్టేట్మెంట్ రికార్డ్ చేస్తోంది. తాజాగా నవీన్ రావు తండ్రి కొండల్ రావు, బీఆర్ఎస్ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకుమారుడితో పాటు మరో ఇద్దరు బీఆర్ ఎస్ నేతలతో పాటు అప్పటి ప్రతిపక్ష నేత ముఖ్యమంత్రి రేవంత్ బంధువులను వారి స్టేట్మెంట్ ఇవ్వాలని సిట్ కోరింది. రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తును వేగవతం చేసింది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేయగా ప్రభాకర్ రావును సైతం పలు మార్లు విచారించింది. ఈ కేసులో చిన్న చిన్న గ్యాప్స్‌ని

...:: మిగతా 2లో

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం

- 6431 ప్రత్యేక బస్సులు ఏర్పాటు
- గమ్యస్థానాలకు చేరవేయడమే లక్ష్యం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

ఉత్తర తెలంగాణ, జనవరి 7: సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 6431 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 18, 19 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో

...:: మిగతా 2లో





ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుల నియామకం

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారంనాడు నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు-పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది.

9



ఆ ముగ్గురు మంత్రులు మోసగాళ్లు

- కమీషన్‌లకు కక్కుర్తిపడి సీతారామసాగర్ ప్రాజెక్టును పక్కనపెట్టారు
- అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం అభివృద్ధికి చేసిందేమీ లేదు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్‌మండిపాటు

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం

జనవరి 7 : ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్‌లకు కక్కుర్తిపడి సీతారామసాగర్ ప్రాజెక్టును పక్కనపెట్టారని మాజీ మంత్రి కేటీఆర్‌మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమీషన్‌లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని,

...:: మిగతా 2లో

ఏప్రిల్ 1 నుండి తొలి విడత

జనగణన

- తొలిసారిగా డిజిటల్ విధానంలో..
- జనగణనతో పాటే కులగణన కూడా
- వెల్లడించిన కేంద్ర హోం శాఖ



ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 7: దేశంలో తొలిసారిగా జనగణనకు రంగం సిద్ధమైంది. తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని పేర్కొంది. ఇందుకు

...:: మిగతా 2లో



ఉద్యమానికి గట్టి దెబ్బ

మరో 26 మంది మావోయిస్టులు సరెండర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

ఉత్తరతెలంగాణ, జనవరి 7: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సూక్మ జిల్లాలో మావోయిస్టు ఉద్యమానికి గట్టి దెబ్బ తగిలింది, జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్,ఎదుట బుధవారం మరో 26 మంది మావో యిస్టులు లొంగిపోయారు. మావోయిస్టుల కోటగా పిలవబడే బస్తర్ రీజియన్‌లో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జనజీవన స్రవంతిలోకి రావాలన్న ప్రభుత్వ పిలుపు మేరకు పోలీసుల పూన నర్కోమ్,కొత్త ఉదయం ప్రచార కార్యక్రమానికి ఆకర్షితులై వీరంతా ఆయు ధాలు వీడుతున్నారు.

కీలక నేతలు.. రూ. 64 లక్షల రివార్డు

లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఉన్నట్లు అధికారులు వెల్లడిరచారు. వీరి ప్రస్థానం పై ప్రభుత్వం గతంలోనే భారీ రివార్డులను ప్రకటించింది. లొంగిపోయిన 26 మందిపై కలిపి ప్రభు త్వం 64 లక్షల రూపాయల రివార్డును ప్రకటించింది. వీరంతా మావోయిస్టు పార్టీకి చెందిన మార్వార్ డివిజన్ మరియు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమిటీ సభ్యులుగా గుర్తించబడ్డారు. ఛత్తీస్‌గఢ్ పోలీసు యంత్రాంగం, సిఆర్పిఎఫ్ అధికారుల సమక్షంలో ఈ లొంగుబాటు ప్రక్రియ జరిగింది. మావోయిస్టు భావజాలం పట్ల విరక్తి చెంది, అభివృద్ధి వైపు మొగ్గు చూపుతూ వీరంతా లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు.



భారతీయ విద్యార్థులకు అమెరికా వార్నింగ్

స్టూడెంట్ వీసాల విషయంలో భారతీయ విద్యార్థులకు అమెరికన్ ఎంబసీ కీలక హెచ్చరిక జారీ చేసింది. వీసాలు హక్కు కాదని, అది ఒక ప్రత్యేక గౌరవం మాత్రమే అని తెలిపింది.

9



అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

- ఇచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది
- ఏప్రిల్ లో రెండో విడత ఇస్తాం
- రానున్న రెండు సంవత్సరాలలో మరో రెండు విడతలు
- మార్చి 31 లోగా సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ పూర్తి చేస్తాం.

ప్రతిపక్షం, హుజూర్‌నగర్, జనవరి 7: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎప్రిల్‌లోగా రెండో విడుత ఇళ్లు ఇస్తామని, రానున్న రెండు సంవత్సరాలలో మరో రెండు విడుతలు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రం సమీపంలో రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల కాలనీ లో నిర్మాణాలపై రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, గృహనిర్మాణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్తో కలిసి మంత్రి సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్లను , సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ హుజూర్ నగర్ లో చేపట్టిన ఇందిరమ్మ హోసింగ్ కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని అన్నారు. రామస్వామి గుట్ట లో చేపట్టిన ఇండ్లనన్నింటిని మార్చి 31 నాటికి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి మిగిలిపోయిన పనులన్నింటిని గుర్తించి పనుల పూర్తికి ప్రతిపాదనలు పంపించాలని, గృహ నిర్మాణాలు, రోడ్లు, విద్యుత్, తాగునీరు, వంటి మౌలిక సదుపాయాలన్నీ పూర్తి చేయాలని అధికారును ఆదేశించారు. హుజూర్ నగర్ కాలనీ పూర్తికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించి, ఎప్పటికప్పుడు పురోగతిని పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మిగిలిపోయిన పనుల పూర్తికి అవసరమైన అంచనాలను రూపొందించి పంపిస్తే ఈ నెల 15లోగా అనుమతులు మంజూరు మంజూరు చేస్తామని అన్నారు. అవసరమైతే పనులను విభజించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రాజకీయాల కతీతంగా కులం, మతం, వర్గం పేరు అడగకుండా అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని, ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలు వెచ్చించి ఇండ్లు కట్టిస్తున్నామని, ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యేలు మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారని, అలాగే గతంలో గృహ జ్యోతి కింద మంజూరు చేసిన ఇండ్లను పూర్తి చేయాలని ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కోరారని అన్నారు. వాటిని కూడా మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వం కాళేశ్వరం కడితే కమిషన్ వస్తుందని ఆలోచించింది తప్ప పేదవాడికి ఇండ్లు కట్టించలేదన్నారు. అంతేకాక గృహ నిర్మాణ శాఖను అస్తవ్యస్తం చేసిందని అన్నారు. గృహ నిర్మాణ పాలసీ ప్రకారం బహు పేదల నుండి ఇండ్లకు దరఖాస్తులను తీసుకొని మార్చి 31 లోపు వారికి ఇల్లు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులను గుర్తించి తుది జాబితా రూపొందించాలని చెప్పారు.

పదేళ్లు దోచుకున్నారు

పర్యాటకంగా కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రకాళి దేవాలయ అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. వరంగల్ ప్రజలు, హన్మకొండ శాసన సభ్యులు రాజేందర్ రెడ్డి కోరిక మేరకు భద్రకాళి అమ్మవారి దేవాలయాన్ని మహా అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. మాడ వీధులు, ఆలయ వెడల్పు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే ఒక కమిటీని వేసి, డీపిఆర్ తయారు చేసుకుని, డబ్బులు ఎంత ఖర్చైనా దేవాలయాలన్నింటిని ఒకే టూరిజం లైన్ లోకి తీసుకురావాలని ఈ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ఇంకా పెండింగ్ ఉన్న పనులను కొద్ది నెలల్లో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అధికారులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

19న మేడారానికి సీఎం రేవంత్ రెడ్డి

- మేడారం ఆధునీకరణ పనుల ప్రారంభం
- హైదరాబాద్ కి దీటుగా వరంగల్ అభివృద్ధి చేస్తాం
- ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై మంత్రి పొంగులేటి సమీక్ష



ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, జనవరి 7: కోట్లాది మంది కొంగు బంగారం, మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణం ఆధునీకరణ కోసం రాతి కట్టడాలతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మేడారం ఆధునీకరణ పనులను ఘనంగా ప్రారంభిస్తామని, లక్షలాదిగ తరలివచ్చే మహా జాతరకు భారీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలలో చేపడుతున్న ప్రగతి పనులు, మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల అధికారులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. వరంగల్ పట్టణాభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా 4వేల కోట్ల రూపాయిలను మంజూరు చేశారని తెలిపారు. రెండవ రాజధాని లాంటి వరంగల్ ను అభివృద్ధిలో హైదరాబాద్ కు ధీటుగా మార్చేందుకు కావాల్సిన సకల సదుపాయాలు, మౌలిక వసతులను కల్పించడానికి ప్రణాళికలు వేస్తున్నామన్నారు. దశల వారీగా చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా కోర్ అర్బన్ ప్రాంతాల్లోని వరద తాకిడికి గురైన ప్రజలకు తొలుత సౌకర్యాలు కల్పించేందుకు నిర్ణయించామన్నారు. ఇక్కడ తొలుత డ్రైనేజీ పనులు చేపడతామని, సుమారు 570 కోట్ల రూపాయిల వ్యయంతో చేపట్టే మౌలిక సదుపాయల కోసం కూడా మరో వారం రోజుల్లో టెండర్లు పిలుస్తామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూం ఇండ్ల మంజూరుతోపాటు ఈ ప్రాంతంలో మధ్య తరగతి, మరీ అత్యల్ప ఆదాయం గల వారి కోసం యుద్ధప్రాతిపదికన హౌసింగ్ బోర్డు తరహాలో ఇండ్లు కట్టించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ త్వరలో పూర్తిచేయాలని ఆదేశాలిచ్చారు. భద్రకాళి ఆలయం మాడవీధుల పనులు, చెరువుతో పూడిక తీసివేత, ఇతర పునరుద్ధరణ పనులకు వర్షాల కారణంగా అంతరాయం కలిగిందని, ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వరదల కారణంగా దెబ్బతింటున్న కాకతీయ టెక్స్టైల్ పార్క్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు అధికారులకు ఆదేశించారు. వరంగల్ ను హెల్త్ సిటీగా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. సుమారు 1,100 కోట్ల రూపాయిలతో నిర్మిస్తున్న 24 అంతస్తుల ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి వచ్చే ఏప్రిల్ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన కలెక్టర్, ఇతర అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. వరంగల్‌లో క్రీడా స్టేడియం, ప్రత్యేకంగా స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు కోసం డీపీఆర్‌ను రూపొందించాలని ఆదేశించారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం

మొదటిపేజీ తరువాయి

ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది. ఈ సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10, 12,13 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 18, 19 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది.

జనగణన

మొదటిపేజీ తరువాయి

సంబంధించి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ గణన డిజిటల్ విధానంలో జరగనున్నట్లు హోం శాఖ పేర్కొంది. పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా నిర్వహించే జన గణన 2021లో చేపట్టాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం రెండు దశల్లో నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్‌ సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇదివరకే స్పష్టం చేసింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే వెల్లడించింది. సమాచారాన్ని సేకరించడానికి లక్షలాది మానవ వనరులను మోహరించడంపైనా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని అధికార వర్గాలు ఇప్పటికే వెల్లడించాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

మొదటిపేజీ తరువాయి

కూడా ఫిల్ చేస్తూ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ ముందుకు వెళ్తోంది. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు విచారణ కస్టోడియల్ విచారణ ఆధారంగా కీలక సమాచారం సేకరించిన సిట్ కేసులో మరో సారి చార్జిషీట్ దాఖలు చేసేందు సిద్ధమవుతోంది. ఇప్పటికే ట్యాపింగ్ బాధితులుగా ఉన్న మొత్తం 618 మందిని దాదాపు అందరి స్టేట్మెంట్‌ను రికార్డ్ చేసిన పోలీసులు ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ తర్వత మరికొంతమందిని పిలిచి విచారిస్తోంది.

9 గంటలపాటు ఎమ్మెల్సీ నవీన్ రావు విచారణ

ఇటీవల ఫోన్ ట్యాపింగ్ పై ఆరోపణలు ఎదర్కొంటున్న ఎమ్మెల్సీ నవీన్ రావును సుమారు 9 గంటల పాటు విచారించింది. కాగా నేడు అతని తండ్రి కొండల రావును విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. అయితే అనారోగ్య సమస్యల కారణంగా సిట్ కార్యాలయానికి రాలేనని తన ఇంటి వద్ద అయితే విచారణకు సిద్దంగా ఉంటానని చెప్పడంతో పోలీసులు పునరాలోచిస్తున్నారు. మరోవైపు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావుకు సైతం సిట్ విచారణకు హాజరుకవాలని కోరింది. విదేశాల్లో ఉండటం వల్లా రాలేకపోతున్నానని వచ్చిన తర్వాత హాజరవుతానని చెప్పినట్లు సమాచారం.

మరికొంత మంది కీలక రాజకీయ నేతలకు నోటీసులు

ఇదిలా ఉంటే ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సైతం సిట్ నోటీసులిచ్చింది. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలను రేపు ఉదయం 11 గంటలకు సిట్ కార్యాలయం హాజరు కావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. కాగా గతంలోనూ చిరుమర్తి లింగయ్యను సిట్ అధికారులు విచారించారు. మరో వైపు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతని బంధువులు, సోదరుల ఫోన్లు కూడా 2023 ఎన్నికల సమయంలో ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించగా వారి స్టేట్మెంట్లు మరోసారి తీసుకోవాలని సిట్ భావిస్తోంది. స్టేట్మెంట్ ఇవ్వాలని రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడానికి ఫోన్ చేయగా తాను అందుబాటులో లేనని చెప్పినట్లు సమాచారం. త్వరలో వచ్చి తన స్టేట్మెంట్ ఇస్తానని పోలీసులకు వివరించినట్లు తెలిసింది. కాగా సంక్రాంతి పండుగ తర్వాత మరికొంత మందిని విచారించి మార్చి చివరిలోపు అనుబంధ చార్జిషీట్ దాఖలు చేయాలని సిట్ భావిస్తోంది. త్వరలో మరికొంత మంది కీలక రాజకీయ నేతలకు కూడా నోటీసులు ఇచ్చి సిట్ విచారించనుంది.

తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేలా
సంక్రాంతి కార్యక్రమాలు

- 13 నుంచి 17 వరకు కైట్ , స్వీట్ ఫెస్టివెల్
- మంత్రి జూపల్లి




ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో,హైదరాబాద్, జనవరి 7: ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

ఆ ముగ్గురు మంత్రులు మోసగాళ్లు

మొదటిపేజీ తరువాయి

అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్ సీతారామ సాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేని, కేటీఆర్ ఎద్దేవా చేశారు.

ఐబొమ్మ రవికి బెయిల్ నిరాకరణ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్. జనవరి 7: సినిమాల పైరసీ కేసులో అరెస్టైన ఇమంది రవి అలియాస్ ఐ బొమ్మ రవికి నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. అతడి బెయిల్ పిటిషన్లను కొట్టి వేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై ఐదు కేసులు నమోదు అయ్యాయి. ఈ ఐదు కేసుల్లో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రవి కోర్టును ఆశ్రయించాడు. తాజాగా, ఈ బెయిల్ పిటిషన్‌లపై నాంపల్లి కోర్టు విచారణ జరిపింది. కేసు దర్యాప్తు దశలో ఉందని, అతను విదేశాల్లో పౌరసత్వం కలిగి ఉన్నాడని పోలీసులు కోర్టుకు తెలిపారు. బెయిల్ ఇస్తే దేశం దాటిపోయే అవకాశం ఉందని కోర్టుకు విన్నవించారు. దీంతో కోర్టు రవి బెయిల్ పిటిషన్‌లను కొట్టి వేసింది. ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు గత బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగు చూశాయి. ఐబొమ్మ రవి రెండు రకాలుగా సినిమా ప్రింట్‌లను కొనుగోలు చేశాడు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఐబొమ్మ రవి తన సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు తెలుసుకున్నారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధికి జాగృతి బ్లూప్రింట్

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గం మంగళవారం (ఈనెల 6న) సమావేశం అయి భవిష్యత్ కార్యాచరణపై చర్చించింది. ప్రజాస్వామిక పద్ధతిలో అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తూ కమిటీలు ఏర్పాటు చేసి వాటి నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జాగృతి ముఖ్య నాయకులు బుధవారం సమావేశమై ''పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం - సంపూర్ణ అధ్యయనం'' సహా 30 కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని, రాష్టంలోని వివిధ రాజకీయ పార్టీల రాజ్యాంగాలను స్టడీ చేసి జాగృతికి ప్రజాస్వామ్య బద్ధమైన, పటిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించడానికి న్యాయ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఎడ్యుకేషన్, హెల్త్, ఎంప్లాయిమెంట్, రైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ సాధికారత, కార్మిక, సింగరేణి, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, లిటరేచర్, హిస్టరీ - హెరిటేజ్, ఎంప్లాయిస్, టీచర్స్, మహిళా సాధికారత, శిశు సంక్షేమం, యూత్ ఎంపవర్మెంట్ , ఆన్ లైన్ కంటెంట్, ఉద్యమకారుల సంక్షేమం, ఇరిగేషన్, బడ్జెట్ ఎనాలిసిస్, మైనార్టీల సాధికారత, వలస (గల్ఫ్) కార్మికుల సంక్షేమం, స్టూడెంట్స్, రెవెన్యూ రిఫార్మ్స్ విభాగాల్లో విద్యావంతులు, నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను నియమించారు. ప్రతి కమిటీలో విధిగా విద్యావంతులైన మహిళా నాయకులకు అవకాశం ఇచ్చారు. కమిటీల బాధ్యులు రానున్న పది రోజుల పాటు వారికి అప్పగించిన రంగాల్లో రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసి నివేదిక రూపొందిస్తారు. తమ నివేదికలను ఈనెల 17వ తేదీన జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ అధ్యక్షతన నియమించిన స్టీరింగ్ కమిటీకి సమర్పిస్తారు. స్టీరింగ్ కమిటీ నివేదికపై జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గం మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై అందరి అభిప్రాయలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకుంటుంది.

రూట్ మ్యాప్ సిద్ధం

ఎజెండా కమిటీ సభ్యులతో కవిత జూమ్ కాన్ఫరెన్స్

జాగృతి రూపొందించబోయే రూట్ మ్యాప్‌సిద్ధం చేయనున్న ఎజెండా కమిటీ సభ్యులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ ప్రాంతాన్ని పరిపాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు, అన్ని పార్టీల రాజ్యాంగాల అధ్యయనం.. అత్యంత ప్రజాస్వామ్యయుతమైన రాజ్యాంగం రూపొందించడం, నీళ్లు నిధులు నియామకాలు సహా 32 అంశాల అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు వేశామన్నారు. కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఈనెల 17వ తేదీ వరకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని సూచించారు.



ఒంటిచేత్తో 8 యుద్ధాలు ఆపేశా. నాటో సభ్య దేశమైన నార్వే నన్ను నోబెల్‌కు ఎంపిక చేయకుండా ఫూలిష్‌గా వ్యవహరించింది. అయినా నోబెల్ నాకు మ్యాటర్ కాదు. ఎన్నో లక్షల మంది ప్రాణాలను కాపాడాను. అది చాలు. అమెరికా లేకుంటే నాటోను ఎవరూ పట్టించుకోరు. రష్యా, చైనాలు దాన్ని లెక్కచేయవు.
- అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్

దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయం

- సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- అంబేద్క ఓపెన్ యూనివర్సిటీలో అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం "బ్రిడ్జ్" ప్రారంభం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో,హైదరాబాద్, జనవరి 7: దేశ పురోగతిలో అంబేద్కర్ కృషి అనిర్వచనీయమని సుప్రీమ్ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డా. బి ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బి. ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ డైలాగ్ ఆన్ గవర్నెన్స్ అండ్ ఈక్విటీ (బ్రిడ్జ్) పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లోతైన ఆలోచనలు, భావజాలాన్నీ ఈ సంస్థ ప్రతిధ్వనిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తపర్చారు. అంబేద్కర్ దార్శనికత సమానత్వం సమగ్రతను కలిగి ఉంటుందన్నారు.. విద్య, ఆర్థిక శాస్త్రం, పరిపాలన విధానంలో ప్రభావవంతమైన కృషి చేసారని వెల్లడించారు. ఆర్టికల్ 70 కుల వివక్షతను రద్దు చేయడం ఒక పెద్ద సంస్కరణ అని పేర్కొన్నారు. బిఆర్ అంబేద్కర్ అన్వేషించని రచనలపై విద్యా కార్యక్రమాలను సవరించాలని సూచించారు. డాక్టర్ అంబేద్కర్ బౌద్ధమత పరివర్తనలను విస్తృతంగా చర్చించడానికి ఈ కేంద్రం ఉపయోగపడాలని ఆకాంక్షించారు. బిఆర్ అంబేద్కర్ ఇతర ఆలోచనల గురించి, ఆయన దూర దృష్టితో తీసుకున్న నిర్ణయాల గురించి విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక న్యాయం, స్వేచ్ఛ, కులం, భాష, విద్య, సాధికారత వంటివి సమానత్వంలో అంతర్భాగమని పేర్కొన్నారు. అవగాహన, విద్యలో అంతరాలను తగ్గించడమే లక్ష్యంగా, సమాజాన్ని విభజించే అదృశ్య గోడలను కూల్చివేసేందుకు బ్రిడ్జ్ ఒక వేదికగా పనిచేస్తుందని వెల్లడించారు. అందరికీ సమాన అవకాశాలను అందించడం, సమ్మిళిత సమాజాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఈ కేంద్రాన్ని, కార్యక్రమాన్ని కొనసాగించడానికి, విస్తరించడానికి రాబోయే ఐదు సంవత్సరాల పాటు ఏటా రూ. 10 కోట్లు నిధులు కేటాయించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. రానున్న రోజుల్లో ఈ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం అన్ని దేశాల పరిశోధకులకు మార్గదర్శిగా నిలువనుందని, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సామాజిక పరిశోధకులతో పలు కమిటీలను ఏర్పాటు చేసి బ్రిడ్జ్ సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్.విజయ కృష్ణా రెడ్డి, ప్రొ. రవీంద్రనాథ్ సోలమన్, అన్ని విభాగాల డైరెక్టర్స్, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు . మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఎండీ సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామ స్థాయి, 28 నుంచి31 వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రతిపక్షం, హైదరాబాద్

కేటీఆర్ అవకాశవాద లీడర్

- మంత్రి జూపల్లి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్: కేటీఆర్ అవకాశవాద లీడర్ అని, రాహుల్ గాంధీ నిజాయితీ గల లీడర్ అని తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోనియాగాంధీ ఇంటికెళ్లి కేసీఆర్, కేటీఆర్ తో పాటు కుటుంబం అంతా కాళ్లు మొక్కిన కేటీఆర్ నేడు ఆ కుటుంబ నేతపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ మోసం చేశాడని, అతడిని నడిబజార్‌లో ఉరి తీయాలని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా మంత్రి జూపల్లి స్పందించారు. రాహుల్ గాంధీ నిజాయితీ గల నాయకుడని, ప్రధాని అయ్యే అవకాశాన్ని సైతం వదులుకున్నారని జూపల్లి ప్రశంసించారు అలాంటి నాయకుడిని ఉరితీయాలనడం సరికాదని జూపల్లి అన్నారు.



వేదజ్ఞానంతో ఆత్మజాగృతి

- వేదగిరి రజతోత్సవంలో చిన్నజీయర్ స్వామి ప్రబోధం

ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి7 : లాల్ పహాడ్ సమీపంలోని వేదగిరి గుట్టపై ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమై 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, వేద పండితుడు డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేదగిరి రజతోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నజీయర్ స్వామి పాల్గొని, వేదాల మూలసూత్రాలను ఆధారంగా చేసుకుని భక్తులకు ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి ప్రసంగిస్తూ వేదాలు కేవలం మంత్రసంపుటి మాత్రమే కాక, సమగ్ర జీవన విధానానికి మార్గదర్శక గ్రంథాలు అని తెలిపారు.వేదాలలో పేర్కొన్న సత్యం, ధర్మం, ఋతం అనే సూత్రాలే మన ఆలోచనలకు, చర్యలకు పునాదిగా ఉండాలని అన్నారు.ఉపనిషత్తుల బోధన ప్రకారం మనసు శుద్ధి ద్వారానే ఆత్మజ్ఞానం సాధ్యమవుతుందని, అదే నిజమైన ఆధ్యాత్మికత అని వివరించారు.వేదజ్ఞానం మనలోని కోపం, అహంకారం, భయాన్ని తగ్గించి, క్షమ, సహనం, కర్తవ్యబద్ధత వంటి మానవ విలువలను పెంపొందిస్తుందని చెప్పారు.సుఖ దుఃఖాలను సమానంగా స్వీకరించాలనే వేదాంత దృక్పథమే జీవన సమతుల్యతకు మూలం అని పేర్కొన్నారు. అదేవిధంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వేదాల నుంచే పుట్టినవని, సమాజంలో శాంతి, సమరసత, ధార్మిక చైతన్యం నిలవాలంటే వేదజ్ఞానాన్ని తరతరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్వామివారు స్పష్టం చేశారు ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి వేదాలను వివిధ సంగ్రహ గ్రంథాలుగా సమీకరించిన వేద పండితుడు డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి రి సేవలను ప్రశంసిస్తూ మంగళ శాసనాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి , విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు బండారు రమేష్ , అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, కమ్మరి భూపాల చారి స్వామి, మనోహర్ రెడ్డి చౌదరిగూడ, లాల్ పహాడ్ కు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.



చెప్పులతో కొట్టిస్తా..

- కేటీఆర్ పై తీవ్రంగా మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 7: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హన్మకొండ కలెక్టరేట్లో నేడు జరిగిన సమీక్ష సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన రాహుల్ గాంధీ గురించి కేటీఆర్ మాట్లాడిన భాష పైన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్ కు లేదు ఎమ్మెల్సీగా రాజీనామా చేసిన కవిత సభలో చేసిన వ్యాఖ్యలపైన, నిన్న జనగామలో బీఆర్ఎస్ సమావేశంలో రాహుల్ గాంధీ పైన చేసిన వ్యాఖ్యల పైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిప్పులు చెరిగారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్ కు లేదని మండిపడ్డారు. కేటీఆర్ వరంగల్ నగరానికి వస్తే చెప్పులతో కొట్టిస్తా రాహుల్ గాంధీని ఉరి తీయాలంటూ కేటీఆర్ చేసిన సంచలన వ్యాఖ్యల పైన, రాహుల్ గాంధీపైన నోటికొచ్చినట్టు చేసిన వ్యాఖ్యలపైన మండిపడిన ఆయన కేటీఆర్ వరంగల్ నగరానికి వస్తే చెప్పులతో కొట్టిస్తానంటూ హెచ్చరించారు. కేటీఆర్ కంటే ఘాటుగా తాము కూడా మాట్లాడగలమని, కానీ తమకు ఆ విచక్షణ ఉందని వ్యాఖ్యానించారు.

జర్నలిస్టు వద్ద లంచం డిమాండ్

- అడ్డంగా బుక్కయిన అవినీతి అధికారులు
- ఈదులపల్లి వద్ద నిర్మాణ పనులకు 2.50 లక్షలు డిమాండ్
- లక్షన్నర చెల్లించినా అందని అనుమతులు
- ఏసీబీని ఆశ్రయించిన జర్నలిస్ట్ బొబ్బిలి ప్రవీణ్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- షాద్ నగర్ లో సంచలనం




ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 7: షాద్ నగర్ లో ఒక దిన పత్రికకు పాత్రికేయుడుగా పనిచేస్తున్న వ్యక్తిని నిర్భయంగా లంచం అడిగి, కాగితాలు ఇవ్వకుండా వేధించి చివరికి ఏసీబీ అధికారులకు బుక్ అయ్యారు.. షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామలోసంచలనం ఇది. జర్నలిస్ట్‌బొబ్బిలి ప్రవీణ్ దెబ్బకు రంగంలోకి దిగిన ఏసిపి శాఖ డిఎస్పి ఆనంద్ లంచం ఆశించిన నందిగామ ఎంపీడీవో సుమతి, ఎంపీఓ ధీర్ సింగ్, వీఆర్వో చెన్నయ్యలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని వారి లంచావతారాలకు తెరదించారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. షాద్ నగర్ పరిధిలో ఓ ప్రముఖ దిన పత్రిక విలేకరిగా పనిచేస్తున్న బొబ్బిలి ప్రవీణ్ నందిగామ మండలం ఈదులపల్లి పరిధిలో రిసార్ట్స్ నడిపిస్తున్నాడు. అందులో కొన్ని గెస్ట్ హౌస్‌ల నిర్మాణాల నిమిత్తం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ్ సింగ్, వీఆర్వో చెన్నయ్యలు ఈ అనుమతుల కోసం ఐదు లక్షలు లంచం ఇవ్వాలని పట్టుబట్టారు. తాను అంత ఇచ్చుకోలేనని బతిమాలగా 2.50 లక్షలకు బేరం కుదిరింది. ఇందులో లక్షన్నర బాధితుడు చెల్లించాడు. కానీ మిగతా లక్ష రూపాయలు ఇచ్చేదాకా అనుమతి పత్రాలు ఇచ్చేది లేదంటూ తేల్చి చెప్పారు. ఇంత బహిరంగంగా జరుగుతున్న అవినీతిని చూసి సహించలేకపోయిన బొబ్బిలి ప్రవీణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల వ్యూహం ప్రకారం బుధవారం మిగతా డబ్బులు ఇచ్చేందుకు జర్నలిస్టు ప్రవీణ్ సమ్మతం తెలిపి వారు చెప్పిన ప్రకారమే అధికారులను కలిసి డబ్బులు చెల్లించాడు. అప్పటికే పంచుకున్న ప్రభుత్వ అధికారి సిబ్బందినీ ఏసీబీ అధికారులు డిఎస్పి ఆనంద్ తో సహా ఇతర పోలీసులు రంగంలోకి దిగి ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ్ సింగ్, వీఆర్వో చెన్నయ్య లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారి నుంచి లంచం రూపంలో తీసుకున్న లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై డిఎస్పి ఆనంద్ మాట్లాడుతూ ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరు పరచనున్నట్లు వెల్లడించారు. అనుమతుల కోసం లంచం అడిగిన వివరాలు వాస్తవమేనని ధ్రువీకరించారు. ఎక్కడైనా అవినీతి జరిగినా, ఎవరైనా లంచాలు అడిగినా దానిని వెలుగులోకి తెచ్చి ఆ అన్యాయానికి అక్షర రూపం ఇచ్చి బాధితులకు న్యాయం చేసేది జర్నలిస్టులు. అలాంటి జర్నలిస్టులని బహిరంగంగా లంచం అడిగారంటే అధికారులు ఏ స్థాయికి తెగించి తమ విధులు నిర్వహిస్తున్నారో ఇక్కడ స్పష్టమవుతుంది. ఎవరైతే నాకేంటి.. లంచం ఇవ్వాల్సిందే.. అన్నట్లుగా నిస్సిగ్గుగా వ్యవహరించడం వల్లనే అధికారులు వరుసగా ఏసీబీకి బుక్ అవుతున్నారు. ఇంతకు ముందు కూడా నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి.



తెలంగాణ జాగృతి పార్టీ కై అధ్యయన కమిటీ ఏర్పాటు

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పైన అధ్యయన కమిటీ సభ్యుడిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఎంపిక

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 7: తెలంగాణ జాగృతి తెలంగాణ లో నూతన ప్రాంతీయ పార్టీగా ఏర్పాటు చేయబోతుండటం ఖాయం గా కనిపిస్తుంది పార్టీ ఏర్పాటుకోసం జాగృతి వ్యవస్థపాక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ప్రజలనుండే పార్టీకి కావాల్సిన అన్ని విషయాలను గ్రహించడం కోసం సుమారు ముప్పై అంశాలతో కూడిన కమిటీలను వేశారు. అందులో ప్రధానంగా జాగృతికి కవితకు ఆది నుండి బలంగా ఉన్న బహుజన నాయకుడు విద్యావంతుడు కవితకు అత్యంత విధేయుడు అయినా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ను తెలంగాణ రాష్ట్రము లో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెతలు ,వారి బాధలు జీత బత్యాలు, ఉద్యగా భద్రత, ఆరోగ్యం, ఇన్సూరెన్స్ ఇలా అనేక అంశాల తో అధ్యయనం చేయనున్నారు దానికి సారధిగా శ్రీకాంత్ గౌడ్ ను కల్వకుంట్ల కవిత ఎంపిక చేశారు అనుబంధంగా పనిచేయటానికి ఈ కమిటీలో ఐదా ప్రశాంత్, వీరన్న కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, ఐలి కవిత వీరిని ప్రకటించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల సాధన ధ్యేయంగా తెలంగాణ జాగృతి భవిష్యత్ కార్యాచరణ మ్యానిఫెస్టో ఉండే విధంగా వీరు పని చేయనున్నారు.



ఉపాధి హమీ చట్ట పరిరక్షణకు దేశ వ్యాప్త ఉద్యమం

- డిల్లీ లో నరెగా సదస్సు లో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, డిల్లీ, జనవరి 7: కూలీలకు పని హక్కులను కల్పించిన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్ట పరిరక్షించాలని వీబి గ్రామ్ జి చట్ట రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఐక్య ఉద్యమం చెపట్టాలని నరేగ సంఘర్షణ మోర్చా నిర్ణయించినదని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. డిల్లీ లోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్ లో రెండు రోజుల పాటు జరిగే నరేగ సంఘర్షణ మోర్చా జాతీయ సమావేశాలు బుధవారం ప్రాంరంభ మయ్యాయని శంకర్ తెలిపారు. ఈ సమావేశం లో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టం పని హక్కులను కల్పిస్తే వికసిత్ భారత్ పేరిట జి గ్రామ్ జి చట్టం పని హక్కులను హరించిందన్నారు.జిగ్రామ్ జి చట్టం ఏప్రిల్ నుండి అమలు కానునందున జి గ్రామ్ జి చట్టం వల్ల జరిగే ప్రమాదాన్ని కూలీలకు,ప్రజలకు ప్రజా సంఘాలకు అవగహన కల్పించనన్నసమన్నారు. వంద రోజులు,125 రోజుల పని కల్పించడం కాదని 365 రోజులు కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కరోన సమయంలో దేశాన్ని ఉపాధి హామి పథకం కాపాడిందన్నారు.ఇప్పటికీ నిధులను తగ్గిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇక నుండి చట్ట ప్రకారమే నిధులకు కొత విధిస్తు కేవలం 60 శాతం నిధులను మాత్రమే కేంద్రం భరిస్తున్నదని 40 శాతం రాష్ట్రాలు భరించాలని చెప్పడం తగదన్నారు.జిఎస్టి పేరుతో తెలంగాణ నుండి పన్నులు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తిరిగి నిధులను ఇవ్వకుండా బాధ్యత రహితంగా వ్యవహరిస్తుందన్నారు.ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన సామాజిక కార్యకర్తలు పాల్గొన్నరని శంకర్ తెలిపారు.



కాంగ్రెస్ లో చేరిన ఖమ్మం బీఆర్ఎస్ కార్పొరేటర్లు

- సీఎం సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం


ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 7: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఖమ్మం కార్పొరేషన్ కు చెందిన ముగ్గురు బీఆర్ఎస్‌కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు దనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మీ, జి. చంద్రకళ, డి. సరస్వతి, అమృతమ్మ, ఎం. శ్రావణి. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లు, కాంగ్రెస్ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, తుమ్మల యుగంధర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు గుడ్ న్యూస్

- సాయంత్రం వేళ ఉచితంగా స్నాక్స్
- తెలంగాణ సర్కార్ నిర్ణయం
- ఈనెల 16 నుంచి మార్చి 10 వరకు అమలు



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 7: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు రూ.4.23 కోట్ల నిధులను విడుదల చేసింది. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు మొత్తం 19 రోజుల పాటు ఈ స్నాక్స్ పంపిణీ చేయనున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. త్వరలో జరగనున్న ఎస్ ఎస్ సీ వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు నిధులను మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.సమగ్ర శిక్షా అభియాన్ కింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల కోసం మొత్తం రూ. 4,23,11,385 నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులను రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు విడుదల చేయాలని స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో నిర్వహించే ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు ఈ ఈవెనింగ్ స్నాక్స్ పంపిణీ చేయనున్నారు. మొత్తం 19 రోజుల పాటు అంటే ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు స్నాక్స్ అందించనున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడంతో పాటు, సాయంత్రం వేళ అదనపు గంటలు చదువుకునే వారికి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లెర్నింగ్ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ఈ బడ్జెట్ ను ప్రభుత్వం కేటాయించింది. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ నిధులను పంపిణీ చేయనున్నారు. ఈ నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సాయంత్రం పూట స్నాక్స్ అందించడం వల్ల విద్యార్థులు ఉత్సాహంగా చదువు పైదృష్టి పెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



తెలంగాణ దాటి వచ్చే గోదావరి నీటినే రాష్ట్ర పరిధిలో తాము వినియోగిస్తాం. అక్కడి ప్రాజెక్టులకు మేం చిల్లు పెట్టడం లేదు కదా? ఆ ప్రాంతం దాటి వచ్చిన నీరు వృథాగా సముద్రంలోకి పోకుండా వాడుకుంటున్నాం. ఒక టీఎంసీ కోసం గతంలో వివాదాలు జరిగాయి. దేశాల మధ్య యుద్ధాలూ జరిగాయి. వేస్ట్‌గా పోయే నీరు భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకూ ఇవ్వొచ్చు.
- ఏపీ మంత్రి నారా లోకేశ్

ఓపెన్ వాయిస్

సవాలు చేస్తే సహించని అగ్రరాజ్యం

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించి సంకెళ్లతో తీసుకెళ్లడం చూస్తుంటే సరిగ్గా 22 -23 ఏళ్ళ క్రితం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుసేన్‌పై దాడి చేసి, ఆ తర్వాత ఉరితీసిన అమెరికా దుశ్చర్య గుర్తుకు వస్తుంది. సద్దాం జీవాయుధాలు తయారు చేస్తున్నాడనే ఆరోపణతో యుద్ధానికి దిగిన అమెరికా అందుకు ఎటువంటి ఆనవాళ్లను ఇప్పటివరకు చూపలేకపోయింది. ఇప్పుడు కూడా అమెరికా వెనెజువెలా పై దాడిచేయడానికి అసలు కారణం 1974లో సౌదీఅరేబియాతో హెన్రీ కిస్సింజర్ చేసుకున్న ఒప్పందం. ఇది వాస్తవానికి అమెరికా డాలర్ మనుగడ గురించి అని మాత్రం స్పష్టం అవుతుంది. ట్రంప్ చెబుతున్నట్లు మాదకద్రవ్యాలు, ఉగ్రవాదం, ప్రజాస్వామ్యం వంటి కారణాలు ఏవీకావు. ఇది 50 సంవత్సరాలుగా అమెరికాను ఆధిపత్య ఆర్థికశక్తిగా ఉంచిన పెట్రో డాలర్ వ్యవస్థను కాపాడుకోవడం కోసమే అని గ్రహించాలి. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్‌ను కూడా తమ మాట వినకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం గమనార్హం. అమెరికా బెదిరించి, బలప్రయోగం చేసి డాలర్లతో అంతర్జాతీయ వాణిజ్యం జరిగేటట్లు చూస్తూ ప్రపంచంలో సంపన్న దేశంగా చెలామణి అవుతుంది. ఎప్పుడైతే యూరోలో చమురు వాణిజ్యం చేస్తానని సద్దాం ప్రకటించారో తన ఆర్థిక వ్యవస్థ కూలిపోతుందని అమెరికా భయపడింది. ఇపుడు కూడా మదురో ఇతర కరెన్సీలలో చమురు వాణిజ్యం చేయడం ప్రారంభించింది.. అమెరికా భయపడిపోయింది. అందుకనే వెనిజులాను అంతం చేస్తామని ట్రంప్ బెదిరించారు. వెనిజులాలో 303 బిలియన్ బారెల్స్ నిరూపితమైన చమురు నిల్వలు ఉన్నాయి. సౌదీ అరేబియా కంటే ఎక్కువ. మొత్తం ప్రపంచ చమురులో 20 శాతం. వెనెజువెలా ఆ చమురును చైనీస్ యువాన్‌లో చురుకుగా అమ్ముతోంది. డాలర్లలో కాదు. 2018లో వెనెజువెలా డాలర్ నుండి విముక్తి పొందుతామని ప్రకటించింది. వారు యువాన్, యూరోలు, రూబిళ్లు, చమురుకు డాలర్లు తప్ప మరేదైనా అంగీకరించడం ప్రారంభించారు. పైగా, బ్రిక్స్‌లో సభ్యతం కోసం దరఖాస్తుకు సిద్ధమయ్యారు. స్విఫ్ట్‌ను పూర్తిగా దాటవేస్తూ చైనాతో ప్రత్యక్ష చెల్లింపు మార్గాలను నిర్మిస్తున్నారు. వారు దశాబ్దాలుగా డాలర్ ఆధిపత్యం తొలగించేందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి తగినంత చమురు నిల్వలు వారి వద్ద ఉన్నాయి. చమురు వ్యాపారం డాలర్లతో జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. అందుకనే, 1974లో, హెన్రీ కిస్సింజర్ సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన అన్ని చమురు ధరలను అమెరికా డాలర్లలో నిర్ణయించే విధంగా అవగాహనకు వచ్చారు. అందుకు బదులుగా, అమెరికా ఆ దేశానికి సైనిక రక్షణను అందిస్తుంది. సంక్షేమ రాజ్యం ,లోటు వ్యయం, పెట్రోడాలర్ సైనిక విమానాలకంటే అమెరికా ఆధిపత్యానికి చాలా ముఖ్యంగా మారింది. అందుకనే దానిని సవాలు చేసే నేతలను అమెరికా సహించలేదు. 2000లో సద్దాం హుస్సేన్‌ను కొట్టి చంపారు. 2011లో నాటో లిబియాపై బాంబులు వేసింది. గడాఫీని లైంగికంగా హింసించి హత్యచేశారు. ఇప్పుడు మదురో. సద్దాం, గడాఫీలు ఇద్దరి వద్ద కంటే ఐదురెట్లు ఎక్కువ చమురుతో యువాన్‌లో చురుకుగా అమ్ముతున్నారు. డాలర్ నియంత్రణ వెలుపల చెల్లింపు వ్యవస్థలను నిర్మించడంతోపాటు బ్రిక్స్‌లో చేరాలని దరఖాస్తు చేసుకున్నాడు. డాలర్ ఆధిపత్యాన్ని కట్టడి చేసేందుకు నాయకత్వం వహిస్తున్న చైనా, రష్యా, ఇరాన్‌లతో భాగస్వామ్యం ఏర్పరచుకున్నాడు. ఇది యాదృచ్ఛికం కాదు. పెట్రోడాలర్‌ను ఎవ్వరు సవాల్ చేసినా వారు సమాధి కావాల్సిందే. రెండు వారాల క్రితం బిగ్గరగా ఇలా అన్నారు: అమెరికన్ చెమట, చాతుర్యం, శ్రమ వెనిజులాలో చమురు పరిశ్రమను సృష్టించాయి. దాని నిరంకుశ దోపిడీ అమెరికన్ సంపద, ఆస్తిపై నమోదైన అతిపెద్ద దొంగతనం. వెనిజులా చమురు అమెరికాకు చెందిందని నిస్సిగ్గుగా బహిరంగంగా చెబుతున్నారు. అయితే చరిత్ర గతి ఎప్పుడూ ఒకే విధంగా ఉండబోదని అమెరికా గ్రహించాలి. అంతర్జాతీయంగా నానాటికీ అమెరికా ఒంటరి అవుతూ ఉండగా, సరికొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయి. ఐరోపా యూనియన్ సైతం అమెరికా ఉనికి చూసి నేడు అప్రమత్తం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. బ్రిక్స్ సమీకరణాలు ఒకవైపు, చైనా, రష్యా మరోవైపు బలమైన ప్రతిఘటన ఇచ్చేందుకు సిద్ధపడుతోంది.

ప్రతిపక్షం
హైదరాబాద్,
గురువారం
08.01.2026

విచ్చలవిడి ఉరిశిక్షలు సౌదీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయా?

ఖైదీల్లో పరివర్తన తీసుకురావడానికి బదులు ఇలా విచ్చలవిడిగా ఉరిశిక్షలు అమలు చేయడం సౌదీ ప్రతిష్టను దెబ్బతీస్తుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఆధునిక దేశంగా మారాలని భావిస్తున్న సౌదీ అరేబియాకి ఇది విరుద్ధమని మానవహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉరిశిక్షల అమలు క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ విజన్ 2030 సంస్కరణల ఇమేజ్‌ను దెబ్బతీస్తుందని విదేశీ నిపుణులు అంటున్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి మరణశిక్షలు అవశ్యం అని అక్కడి పాలకులు చెబుతున్నారు.



జి.సత్యనారాయణరాజు
9440571617

తెలుగు సినిమా 'అభిలాష'లో అమాయకుడికి శిక్ష పడకూడదనే సందేశం ఇస్తారు మెగాస్టార్ చిరంజీవి. 'స్టాప్' అనే అరుపుతో ఉరిశిక్ష ఆగిపోవడం అనేది మనం సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ పెద్ద పెద్ద నేరాలకు ఇస్లామిక్ దేశాల్లో ఉరిశిక్షలు సర్వసాధారణం. సౌదీ అరేబియాలాంటి దేశాల్లో వందలాది ఉరిశిక్షలు అమలవుతుంటాయి. 2025లో సౌదీ రికార్డు స్థాయిలో 356 మందికి ఉరిశిక్షల్ని అమలు చేసింది. ఒకే ఏడాదిలో మరణశిక్షలకు గురైన ఖైదీల విషయంలో సౌదీ రికార్డ్ సృష్టించింది. ఉరిశిక్షల పెరుగుదలకు ప్రధాన కారణం మాదకద్రవ్యాలపై యుద్ధం అని అక్కడి నిపుణులు చెబుతున్నారు. మొదటిసారిగా అరెస్టయిన వారిలో కూడా చాలా మంది ఇప్పుడు ఉరిశిక్షలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక డేటా ప్రకారం, 2025లో కేవలం డ్రగ్స్ సంబంధిత కేసుల్లోనే 243 మందికి ఉరిశిక్ష విధించారు. 2024లో సౌదీ 338 మందికి ఉరిశిక్ష విధించింది. సుమారు మూడు సంవత్సరాల పాటు మాదకద్రవ్యాల కేసులలో మరణశిక్షను నిలిపివేసిన తర్వాత, సౌదీ అరేబియా 2022లో మాదకద్రవ్యాల నేరాలకు ఉరిశిక్షలను తిరిగి ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం.. అరబ్ ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన సౌదీ అరేబియాలో క్యాప్టగాన్ అనే అక్రమ ఉత్ప్రేరకానికి అతిపెద్ద మార్కెట్ ఉంది. ముఖ్యంగా సిరియా నుంచి ఇది సరఫరా అవుతుంది. మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రారంభించినప్పటి నుండి, దేశం హైవేలు, సరిహద్దు క్రాసింగ్‌ల వద్ద పోలీసు తనిఖీ కేంద్రాలను పెంచింది. ఈ తనిఖీల్లో మిలియన్ల కొద్దీ మాదకద్రవ్యాల మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. డజన్ల కొద్దీ స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఇలా పట్టుబడుతున్న వారిలో విదేశీయులే ఎక్కువ. ఖైదీల్లో పరివర్తన తీసుకురావడానికి బదులు ఇలా విచ్చలవిడిగా ఉరిశిక్షలు అమలు చేయడం సౌదీ ప్రతిష్టను దెబ్బతీస్తుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఆధునిక దేశంగా మారాలని భావిస్తున్న సౌదీ అరేబియాకి ఇది విరుద్ధమని మానవహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉరిశిక్షల అమలు క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ విజన్ 2030 సంస్కరణల ఇమేజ్‌ను దెబ్బతీస్తుందని విదేశీ నిపుణులు అంటున్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి మరణశిక్షలు అవశ్యం అని అక్కడి పాలకులు చెబుతున్నారు. భారతదేశంలో అత్యాచారం చేసినవారికి కూడా మరణశిక్షలు విధించడం చాలా అరుదు. అత్యాచారం చేస్తే మహా అయితే జైలు శిక్ష వేస్తారు అనే చులకన భావంతో కొంతమంది మూర్ఖులు రెచ్చిపోతున్నారు. అలా కాకుండా అత్యాచారానికి కూడా మరణశిక్ష లాంటి వాటిని అమలు చేస్తే తప్ప సమాజంలో విప్లవాత్మకమయిన మార్పు రాదంటున్నారు. కొన్ని దేశాలు అత్యాచారాన్ని తీవ్ర నేరంగా పరిగణించి ఉరి శిక్షను అమలు చేస్తున్నాయి. మన దగ్గర కూడా అత్యాచారాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించి, కఠినమైన శిక్షలు అమలు చేస్తేనే మంచిదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అమెరికాలో అయితే అత్యాచార నిందితులకు గరిష్టంగా 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు. చిన్నపిల్లలపై అత్యాచారం చేస్తే మాత్రం మరణశిక్ష విధిస్తారు. రష్యాలో అయితే నిందితులకు 4 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష విధించే అవకాశముంది. ఇటువంటి కేసులలో అరెస్టయిన వారికి 20 సంవత్సరాల వరకూ ఎటువంటి ఉద్యోగమూ ఇవ్వరు.ఈ విధమయిన శిక్షల వల్ల నేరం చేయాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. టెక్నాలజీలో ఎంతో ముందున్న జపాన్ లో అయితేఅత్యాచారం చేస్తే 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు. అత్యాచారంతో పాటు దోపిడి కూడా చేస్తే మాత్రం మరణశిక్ష ఖాయం. నార్వేలో మరణశిక్షలు ఉండవు. ఇక్కడ నిందితులకు 4 నుంచి 15 ఏళ్ల కఠినశిక్ష విధిస్తారు. నెదర్లాండ్స్ లో బహిరంగంగా ఫ్రెంచ్ కిస్ చేస్తే కఠిన శిక్షలు అమలుచేస్తారు. నిబంధనల్ని ఉల్లఘించి ప్రవర్తిస్తే అత్యాచారంగా భావించి 4 నుంచి 15 ఏళ్ల శిక్ష విధిస్తారు.బంగ్లాదేశ్ లో అయితే నిందితులకు జీవిత ఖైదు విధిస్తారు. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే మరణశిక్ష విధించడం జరుగుతుంది.యూఏఈలో నిందితుడికి 7 రోజుల్లోనే మరణశిక్షను అమలు చేస్తారు. బాధితులు అంగీకరిస్తే తప్ప శిక్ష నుంచి తప్పించుకోవడం కష్టం. మన పొరుగున ఉన్న పాకిస్తాన్: గ్యాంగ్ రేప్, పిల్లలపై అత్యాచారం కేసులకు మరణశిక్ష విధిస్తారు. మహిళలపై దాడులకు దిగి, వారి అవయవాలు కనిపించేలా చేసినా కూడా మరణశిక్షే విధిస్తారు. ఫ్రాన్స్ దేశంలో బాధితురాలు మరణిస్తే 30 ఏళ్ల జైలు శిక్ష నుంచి జీవితఖైదు విధిస్తారు. తక్కువలో తక్కువగా 15 ఏళ్ల శిక్ష విధించడం ఖాయం. ఇజ్రాయిల్ దేశంలో అయితే ఏవిధమైన లైంగిక నేరం చేసినా 16ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. క్యూబా దేశంలో శిక్షలు ఘోరాతిఘోరంగా ఉంటాయి. అత్యాచారం కేసులో ఇరుక్కొని.. మరోసారి అత్యాచారం చేసినా లేదా 12 ఏళ్లలోపు పిల్లలపై అత్యాచారం చేసినా ఉరిశిక్ష వేస్తారు.చైనాలో అత్యాచారం తీవ్రమైన నేరం. విచారణ వేగంగా పూర్తి చేసి దోషుల్ని శిక్షిస్తారు. తుపాకీతో కాల్చడం లేదా పురుషాంగాన్ని తొలగించే శిక్షను ఇక్కడ విధిస్తుంటారు.ఉత్తరకొరియాలో అయితే శిక్షలు కఠినంగా ఉంటాయి. నేరానికి పాల్పడిన నిందితుల మర్మాంగాలపై తుపాకీతో కాల్చి చంపుతారు. కొన్నిసార్లు తలపై కూడా కాలుస్తుంటారు. ఇక్కడ దాదాపు మరణశిక్షలే అమలవుతుంటాయి.



ఇరాన్ లో కూడా అత్యాచార నిందితులకు ఉరి శిక్ష లేదా తుపాకీతో కాల్చడం వంటి శిక్షలు ఖాయం. ఈ శిక్షల్ని జనం మధ్యే బహిరంగంగా అమలుచేస్తారు. ఎందుకంటే ఇలాంటి శిక్షలు అమలుచేస్తే నిందితుల్లో భయం ఉంటుందని భావిస్తున్నారు. నిజానికి ఉరిశిక్ష చాలా తీవ్రమయినదిగా పరిగణించాలి. అయితే ప్రపంచంలో అనేక దేశాలు ఉరిశిక్షను రద్దుచేశాయి. ఆ జాబితాలో పోర్చుగల్, నెదర్లాండ్స్, డెన్మార్క్, బెల్జియం, ఐర్లాండ్, ఇటలీ, స్పెయిన్, హంగేరీ, రొమేనియా, వెనిజులా, అర్జెంటీనా, పరాగ్వే, కెనడా, కోస్టా రికా, డొమినికన్ రిపబ్లిక్, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజి, మొజాంబిక్, కంబోడియా, సైప్రస్, జింబాబ్వేలు ఉరి శిక్షకు చరమగీతం పాడాయి. అన్ని నేరాలకు మరణశిక్షను రద్దు చేసిన మొదటి దేశం వెనిజులా. 1863లో ఉరిశిక్ష రద్దుచేస్తూ వెనిజులా ప్రభుత్వం నిర్ణయించింది. బ్రెజిల్, ఫిజీ, పెరు, కెన్యా వంటి దేశాలు సాధారణ నేరాలకు మాత్రమే మరణశిక్షను రద్దు చేశాయి, సైనిక నేరాలకు ఉరిశిక్షను అమలుచేస్తున్నాయి. కొన్ని దేశాలు చట్టంలో మరణశిక్ష ఉన్నప్పటికీ, కనీసం 10 సంవత్సరాలుగా అమలు చేయడంలేదు. 2021 చివరి నాటికి 108 దేశాలు మరణశిక్షను పూర్తిగా రద్దు చేశాయి. ఇది ప్రపంచ దేశాలలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు.

(వ్యాసకర్త జర్నలిస్టు)

బీసీ మెదళ్లలో అగ్రకుల సిద్ధాంతం




సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారతదేశంలో వేల సంవత్సరాల అగ్రకుల ఆధిపత్య భావజాలం కేవలం రాజకీయ, ఆర్థిక రంగాల్లోనే కాకుండా, వెనుకబడిన వర్గాల మెదళ్లలోకి చొరబడింది. ఇటీవల దళిత మహిళా డాక్టర్ ఆత్మహత్య ఇందుకు నిదర్శనంగా నిలిచింది. తెలంగాణలో సిద్ధిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 23 ఏళ్ల దళిత హౌస్ సర్జన్ పేద కూలీ కుటుంబం నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక సంక్షేమ హాస్టళ్ల ద్వారా ఎంబిబిఎస్ వరకు చేరింది. ఆ యువతి, బీసీ కంసాలి కులానికి చెందిన సీనియర్ డాక్టర్‌తో ప్రేమలో పడి, అతని వివాహ వాగ్దానాన్ని నమ్మింది. చివరకు ఆ యువకుడు వారి పెద్దల మాటలు నమ్మి కుల భేదాన్ని చూపించి వెనక్కి తగ్గడంతో ఆమె మనోభారంతో ఆత్మహత్య చేసుకుంది. ఇది వ్యక్తిగత ప్రేమ విఫలం కాదు, అగ్రకుల భావజాలం బీసీ వర్గాల మెదళ్లలో పెంచిన కుల దురహంకారానికి నిదర్శనం. ఈ ఘటన రాజకీయ పార్టీలు, మీడియా "ప్రేమ విషాదం"గా చూపిస్తున్నప్పటికీ, దళితుల్ని బీసీల కంటే తక్కువనే విషబీజాన్ని నాటడం వల్లనే ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా బీసీ, ఎస్సీ కులాల్లో సైతం అంతర్గత కుల వివక్ష కొనసాగుతుంది. దీంతో వివాహ సంబంధాలకు దూరంగా ఉంటున్నారు. ఇది అగ్రకుల దుర్విచక్షణ బీసీ సమాజ మెదళ్లలో ఎంత లోతుగా చేరిందో అనే దానికి తాజా నిదర్శనం.

ఎక్కడికి వెళ్ళినా కులం విడదు.

ఈ దేశంలో దళితులు చదువుకున్నా, ఉద్యోగం చేసినా, నగరానికి వచ్చినా కులం వీడడం లేదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఒక సాధారణ విద్యార్థి కాదు. పీహెచ్‌డీ స్కాలర్. అంబేద్కర్ స్టూడెంట్ లీడర్. అయినా అగ్రకులాలు దళితులపై కులవివక్ష, రాజకీయ దాడులు అతన్ని ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించాయి. ఇది దేశవ్యాప్త నిరసనలకు దారితీసింది. ఎయిమ్స్ లో దళిత విద్యార్థి బాల్ ముకుంద్ భారతి మెడిసిన్ చదవడానికి అర్హుడు కాదు అని అగ్రకుల అధ్యాపకుల అవమానాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది ఇంతటితో ఆగకుండా ఐఐటిలు, మెడికల్ కళాశాలల్లో సైతం కుల వివక్షతతో పలువురు విద్యార్థులు ఆత్మహత్య



కు పాల్పడుతున్నారు. ఐఐటీలో 25 శాతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని సర్వేలు చెప్తున్నాయి. కుల వేధింపులతో హర్యానాకు చెందిన అడిషనల్ డీజీపీ స్థాయి అధికారి పూరణ్ కుమార్ మరణం దేశవ్యాప్తంగా సంచలమైంది. కరీంనగర్ పట్టణంలో ఇటీవల ఎస్సీ, ఎస్టీలకు ఇల్లు అద్దెకి ఇవ్వబడదని ఓ ఇంటి యజమాని ఏకంగా బోర్డు పెట్టాడు. కావున పై ఉదాహరణల ద్వారా స్పష్టమవుతున్న విషయం ఏమిటంటే ఈ దేశంలో కులమే నిజం. చట్టాలు, రాజ్యాంగం ఉన్న కుల భూతం తొలగడం లేదు. ఇప్పటికే దళితుడు గుడిలోకి వెళ్లాడని కొట్టారు, గుర్రం ఎక్కాడని చంపారు, మీసం తిప్పాడని దాడి చేశారు, ప్రేమించాడని ఊచకోత కోశారు. నేడు కులం రూపం, పద్ధతి మారుతుంది, కానీ అణచివేత కొనసాగుతుంది. ఇది కేవలం దళితులకే పరిమితం కాలేదు. బీసీ కులాల సైతం అక్కడక్కడ కులవివక్షతకు, కుల బహిష్కరణకు గురవుతున్న సందర్భాలు చూస్తున్నాం. వారి జనాభా తగిన విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్స్ ను ఆధిపత్య కులాలు అడ్డుకోవడమే అతి పెద్ద వివక్ష.. మాకు అసలు కులం లేదనే, కులం తెలియదనే బహుజన మేధావులంతా ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి.

బీసీ ఎస్సీ ఎస్టీలంతా దళితులే.

అగ్రకులాలు కులాన్ని కులతత్వ సాధనాలుగా మారుస్తూ బీసీ ఎస్సీ ఎస్టీల మధ్య ఐక్యతను దెబ్బతీస్తున్నారు. బీసీలను ఎస్సీలపై ఎగ దోస్తూ, ఎస్సీలను బీసీలపై ఎగదోస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నారు. దీని అర్థం చేసుకోకుండా బీసీ,ఎస్సీ ఎస్టీలు నిత్యం విద్వేషాలతో రగులుతున్నారు. వాస్తవంగా దళితులు అంటే విడగొట్టబడిన సమాజం (broken people). నేటి బీసీ ఎస్సీ ఎస్టీలంతా దళితులే. కానీ బీసీలను "శూద్రులు"గా, దళితులను "అస్పృశ్యులు"గా ముద్ర వేసిన అగ్రకుల సిద్ధాంతం బీసీ మెదళ్లలోనూ స్థిరపడింది. ఫలితంగా, అణచివేతకు గురైన బీసీ లు కూడా కొంత విద్య, ఉద్యోగం, అవకాశంతో సామాజికంగా ఉన్నత స్థితికి చేరగానే "దళితుల కంటే ఉన్నతులమని భావించుకుంటున్నారు. ఈ భావన వల్లే సిద్దిపేట మెడికల్ కళాశాలలో డాక్టర్ వంటి గొప్ప చదువు చదివిన దళిత యువతికి, బీసీ యువకుడి పెళ్లికి కులం అడ్డు వచ్చింది. ఈ అంతర్గత బ్రాహ్మణతత్వం సమాజంలో బీసీ, ఎస్సీల మధ్య సంఘర్షణకు దారి తీస్తున్నాయి. విద్వేషాలను రెచ్చగొడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అగ్రకుల ఆధిపత్య భావజాలమే. ఇప్పటికీ దళిత, బహుజనులు అగ్రకుల వర్ణ సిద్ధాంతంతో విడిపోయిన సామాజిక, రాజకీయ అనాథలే. ఈ విషయాన్ని అంబేద్కర్, పూలేలు స్పష్టం చేశారు. వారి స్ఫూర్తితో గత కొన్ని నెలల నుంచి తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలంతా ఉమ్మడిగా ఉద్యమిస్తున్నారు. మరోవైపు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీసీ ఎస్సీ ఎస్టీల జాక్ అధికారం, హక్కుల పోరాటం బహుజనుల ఐక్యతకు, అధికారానికి ముందడుగు వేస్తుంది. ఈ క్రమంలో బీసీ, ఎస్సీల మధ్య కుల పరమైన అంతరాలు పెచ్చరిల్లడం, సామాజిక, రాజకీయ చైతన్యానికి ప్రమాదకరం. బీసీలు అగ్రకులతత్వం వీడాలి. తమ చారిత్రక నేపథ్యాన్ని, భారత రాజ్యాంగ విలువలను అర్థం చేసుకొని బహుజనులు సామాజిక దుర్విచక్షణకు దూరంగా ఉండాలి.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

శాపమైన శ్రమ.. పాపమైన పాలన!



ఫిరోజ్ ఖాన్
9640466464

తెలంగాణలో ప్రజా పాలన ముసుగులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. పేదరికంపై యుద్ధం ప్రకటిస్తున్నామన్న పాలకుల మాటలు కోటలు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో నాలుగున్నర లక్షల మంది శ్రమజీవుల కడుపు మాడుతోంది. ఏజెన్సీల పేరుతో సాగుతున్న రూ. 2,400 కోట్ల దోపిడీ, భోగస్ ఉద్యోగుల ప్రచారం వెనుక ఉన్న కుట్రలు చూస్తుంటే.. ఇది ప్రజా ప్రభుత్వమా లేక దళారీ వ్యవస్థా అన్న సందేహం కలుగుతోంది. ఉద్యోగ భద్రత అడిగితే ఉద్వాసన పలుకుతూ, హక్కుల కోసం పోరాడితే బ్లాక్ మెయిల్ చేస్తున్న ప్రస్తుత పరిస్థితులు గర్హనీయం.

ఏజెన్సీల మాఫియా..


రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ వ్యవస్థ ఒక భారీ కుంభకోణంగా మారింది. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే వేతనాల నుంచి ఏజెన్సీలు దాదాపు రూ. 200 కోట్ల కమీషన్లను దండుకుంటున్నాయి. ఏడాదికి రూ. 2,400 కోట్ల ప్రజా ధనం మధ్యవర్తుల జేబుల్లోకి వెళ్తోంది. ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లిస్తే ఈ నిధులు ఆగిపోతాయని తెలిసినా, పాలకులు ఏజెన్సీలనే ఎందుకు ప్రోత్సహిస్తున్నారన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ దళారీ వ్యవస్థను రద్దు చేయడానికి ఒక్క ప్రభుత్వ ఉత్తర్వు సరిపోతుంది, కానీ రాజకీయ లాబీయింగ్ ఆ ఫైలును కదలనివ్వడం లేదు.

భోగస్ ఉద్యోగుల ముసుగులో 'మైండ్ గేమ్'

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులు తిరగబడకుండా ఉండేందుకు 'భోగస్ ఉద్యోగులు' అనే కొత్త అస్త్రాన్ని ప్రయోగించారు. దాదాపు రెండు లక్షల మంది భోగస్ ఉద్యోగులు ఉన్నారని ప్రచారం చేస్తూ, నిజమైన ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న వారిని కూడా డూప్లికేట్ అనడం వెనుక వారిని మానసికంగా కృంగదీసే కుట్ర ఉంది. తాము నోరు మెదిపితే ఉన్న ఉద్యోగం ఎక్కడ పోతుందో అన్న భయం కల్పించి, కార్పొరేషన్ ఏర్పాటు డిమాండ్‌ను పక్కదారి పట్టించడమే పాలకుల అసలు లక్ష్యం గా ఉన్నట్లు తెలుస్తుంది.

ఈఎస్ఐ, పీఎఫ్ నిధుల స్వాహా!

అవుట్‌సోర్సింగ్ నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగికి ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాల్సిన బాధ్యత ఏజెన్సీలదే. ప్రభుత్వం నుండి ఈ నిధులు విడుదలవుతున్నా, ఏజెన్సీలు వాటిని ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడం లేదు. ఇది తీవ్రమైన క్రిమినల్ నేరం. కనీసం రూ. 13,000 జీతం



తీసుకునే పేద కార్మికుడికి వైద్య భద్రత కూడా లేకుండా చేయడం పాలనాపరమైన పాపం కాదా. హెల్త్, సోషల్ వెల్ఫేర్ వంటి శాఖల్లో నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం నిబంధనలకు విరుద్ధం.

కార్పొరేషన్ హామీ ఏమైంది?

ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థను రూపుమాపారు. ఎన్నికల ముందు తెలంగాణలో కూడా కాంగ్రెస్ ఇదే హామీ ఇచ్చింది. కర్ణాటకలో కూడా తమ పార్టీ ప్రభుత్వం కార్పొరేషన్ దిశగా అడుగులు వేస్తోంది. కానీ ఇక్కడ మాత్రం బడ్జెట్ సాకులు చూపుతూ, ఫైళ్లను మంత్రిత్వ శాఖల మధ్య తిప్పుతున్నారు. ఏజెన్సీలకు ఇచ్చే కమీషన్లు ఆపితేనే కార్పొరేషన్ నిర్వహణకు నిధులు సరిపోతాయని నిపుణులు చెబుతున్నా, ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోంది.

కోర్టు తీర్పులు.. లీగల్ అంశాలు!

సుప్రీం కోర్టు గతంలో "సమాన పనికి సమాన వేతనం" ఉండాలని, ఉద్యోగుల శ్రమను దోచుకోవడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టమైన తీర్పులు ఇచ్చింది. ఫైనాన్షియల్ అప్రూవల్ లేదని సాకులు చూపుతూ దశాబ్దాలుగా పని చేస్తున్న వారిని తొలగించడం చట్టపరంగా నిలవదు. 20 ఏళ్లుగా జీతాలు ఇస్తున్నప్పుడు లేని అప్రూవల్ ఇప్పుడే ఎందుకు సమస్యగా మారుతోంది? కరీంనగర్ వంటి ప్రాంతాల్లో జరిగిన అక్రమ తొలగింపులపై ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ప్రభుత్వానికి చట్టపరమైన ఎదురుదెబ్బ తప్పదు.

(వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917
ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

పార్టీ ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత మంతనాలు

- పార్టీ ఏర్పాటులో కీలకం కానున్న హెచ్ ఎంఎస్



ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, జనవరి 7: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ ఏర్పాటు పై కసరత్తును ప్రారంభించింది. దీనిలో భాగంగా ముఖ్యులతో రెండు రోజులుగా హైదరాబాద్‌లో తన నివాసంలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఇటీవల మండలి సమావేశంలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన ఆమె నూతన పార్టీ ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ పార్టీ ఏర్పాటులో హెచ్ ఎంఎస్ యునియన్ కీలకం కానుంది. ఈ సమావేశాలకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ 11 ఏరియాల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూడ కవిత ఏర్పాటు చేయబోయే పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరందరిని రియాజ్ అహ్మద్ హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. పార్టీ ఏర్పాటుకు సంబందించి రియాజ్ అహ్మద్ కీలక మంతనాలు జరిపారు. పార్టీ ఏర్పాటుకు ముందు మరో కొద్ది రోజుల్లో సింగరేణిలో జరుగనున్న కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ ఎంఎస్‌ను గుర్తింపు సంఘంగా గెలిపించే బాధ్యత తీసుకోవాలని కవితను కోరారు. దీనికి ఆమె అంగీకారం తెలిపారు. గుర్తింపు సంఘం గెలువడానికి సంబంధించి అనుసరించాల్సిన విధానాలను కూడ రియాజ్ అహ్మద్‌కు వివరించారు. ఇప్పటికే కవిత హెచ్ ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలుగా నియమితులైన సందర్భంగా ఖమ్మం జిల్లాలో జాగృతి పోరుబాటు హెచ్ ఎంఎస్ బాయిబాట కొనసాగుతున్నందున ఇదే అవకాశంగా తీసుకొని విస్తృతంగా గనుల డిపార్టుమెంట్ల వద్ద 11 ఏరియాలో బహిరంగ సభలు పెట్టాలని గుర్తింపు సంఘం ఏఐటీయుసీ ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయుసీ విధానాలను ఎండగడుతూ ఉద్యోగులను చైతన్య వంతులను చేయాలని రియాజ్ కవితకు సూచించారు. పార్టీ ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో సింగరేణిలో హెచ్ ఎంఎస్ గెలువడం ద్వారా తెలంగాణలోని ఆరు జిల్లాలో సింగరేణి సంస్థ విస్తరించి ఉన్నందున దాదాపు పార్టీ విస్తరణకు ఇది సులభం అవుతుందని సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులను పెట్టడం ద్వారా గెలుపు సులభం అవుతుందని కూడ రియాజ్ వివరించారు. దీనికి సుముఖత వ్యక్తం చేసినిట్లు తెలిసింది. ఇప్పటికే కార్మికులకు జరుగుతున్నటువంటి అన్యాయాన్ని ఎండగట్టాలని కవిత తెలిపిందని రియాజ్ పేర్కొన్నారు. పార్టీ ఏర్పాటు సమావేశంలో తాము పాల్గొనడం అదృష్టంగా బావిస్తున్నామని తెలిపారు. రెండు సార్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ రావడం వెనుక కవిత కృషి,శ్రమ ఉందని ఆయన తెలిపారు. సంక్రాంతి అనంతరం ఉగాది తరువాత పార్టీ రాబోతుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్ష లక్ష్యంగా పార్టీని ఏర్పాటు కాబోతుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు దీనిలో పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఇప్పటికే చాలామంది ముఖ్యులు తమ గౌరవ అధ్యక్షురాలను కలుస్తున్నారని పార్టీ ఏర్పడిన వెంటనే చాలా మంది చేరుతారని కూడ ఆయన తెలిపారు. 11 ఏరియాల్లో తమ యూనియన్ పటిష్టంగా ఉన్నందున అందరూ కూడ పార్టీలో చేరుతారని తెలిపారు. ఒక్కో జిల్లాలో కోల్‌బెల్ట్ వ్యాప్తంగా పార్టీని విస్తరణ ఏకైక ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. పార్టీ ప్రారంభం అయిన అనంతరం మంచిర్యాల నుంచి తమ అధ్యక్షురాలు కవిత రామగుండం నుంచి తాను పోటి చేస్తామని ఆయన ముందస్తుగానే పేర్కొన్నారు. తప్పకుండా ప్రజలు తమ పార్టీని ఆదరిస్తారని అన్నారు. రాష్ట్రంలోకాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం తమ పార్టీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మేధావులు ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదులందరూ కూడ ఒక్కసారి ఆలోసించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుంభకోణాల్లో మునిగిపోయిన బీఆర్ఎస్ హామీలను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలపై పోరాడే సత్తాలేని బీజేపీతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని తెలిపారు. కవిత నేతృత్వంలోని పార్టీ సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు నూతన గనుల ఏర్పాటు ఉపాధి అవకాశాల పెంపుదల సింగరేణి మనుగడే లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. ఇప్పటి నుంచే తమ యూనియన్ గనుల, డిపార్టుమెంట్లతోపాటు కార్మిక కాలనీల్లో కూడ ప్రచారం చేయబోతున్నామని తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్‌లాగా మాయవతి నేతృత్వంలోని బీఎస్పీ తరహాలో తెలంగాణలో కూడ కవితక్క సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా




ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 7: డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు లో తెలంగాణ స్టేట్ నాలెడ్జ్ సెంటర్స్ (టి ఎస్ కె సి) మరియు నిర్మాణ్.ఆర్గ (నిర్మాన్.ఆర్గనైజషన్) సంయుక్త ఆధ్వర్యంలో 9వ జనవరి 2026 తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వడ్లూరి శ్రీనివాస్, టి ఎస్ కె సి కోఆర్డినేటర్ జె. విమల తెలిపారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా పటాన్‌చెరు మరియు పరిసర ప్రాంతాల ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ డిగ్రీ విద్యార్థులు, మరియు నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. పలు ప్రతిష్టాత్మక కంపెనీలు యాక్సిస్ యాక్సిస్ బ్యాంకు, మేడప్లస్ ,రిలయన్స్ జిఓ, టాటా ఎలక్ట్రానిక్స్, హెచ్డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్, సుథెరలాండ్ ,జెనపాక్ట్, టెక్ మహీంద్రా ,డీపీసీ స్టాండర్డ్ గ్రూప్ అఫ్ కంపెనీస్, లాంటి కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన కళాశాల అధ్యాపక బృందం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కావున ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో పేరును నమోదు చేసుకొని 912026 శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కాగలరని కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాకు సహకరిస్తున్న టి ఎస్ కె సి, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థలకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు మరియు యువత సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



శక్తి నిల్వపై విస్తృత శోధన

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో వెల్లడించిన ఏఆర్ సీఐ శాస్త్రవేత్త డాక్టర్ బులుసు శారద

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 7: శక్తి నిల్వ పదార్థాలు, పరికరాలపై అధునాతన పరిశోధనలు కొనసాగుతున్నాయని, ఇది క్రమంగా బ్యాటరీలు, సూపర్‌కెపాసిటర్లలో ఆవిష్కరణలకు దారితీస్తాయని భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన పౌడర్ మెటలర్జీ నూతన పదార్థాల కోసం అంతర్జాతీయ అధునాతన పరిశోధనా కేంద్రం (ఏఆర్ సీఐ) శాస్త్రవేత్త డాక్టర్ బులుసు వి.శారద తెలియజేశారు. అధునాతన పదార్థాలు, బ్యాటరీల కేంద్రం (సీఏఎంబీ) విభాగాధిపతి అయిన ఆమె గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లో 'బ్యాటరీలపై అధునాతన పరిశోధనలు, ఆవిష్కరణలు' అనే అంశంపై బుధవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. 'సైద్ధాంతిక పరిశోధనను సాంకేతికతగా మార్చడం, దానిని భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడం' కార్యక్రమం కింద నిర్వహించిన ఈ ఉపన్యాసంలో, లిథియంఅయాన్, సోడియంఅయాన్, లిథియంసల్ఫర్ బ్యాటరీలు, సూపర్‌కెపాసిటర్లలోని వర్తమాన పురోగతుల గురించి డాక్టర్ శారద వివరించారు. నానోనిర్మిత పదార్థాలు, అధునాతన తయారీ పద్ధతులతో పాటు, శక్తి సాంద్రత, భద్రత, సైక్లింగ్ స్థిరత్వం, అయాన్ రవాణా, తక్కువ ఖర్చులోని కీలక సవాళ్లు, ఆవిష్కరణల గురించి ఆమె చర్చించారు. అత్యంత ఖర్చుతో కూడుకున్నదైన కోబాల్ట్ రహిత కాథోడ్లు, సోడియంఅయాన్ బ్యాటరీలు, లిథియంసల్ఫర్ వ్యవస్థలు, పౌచ్ సెల్ తయారీ వంటి బ్యాటరీ పదార్థాలలో ఏఆర్ సీఐలో కొనసాగుతున్న దేశీయ పరిశోధన కార్యక్రమాలను డాక్టర్ శారద వివరించారు. వాటి పారిశ్రామిక ఔచిత్యాన్ని, సాంకేతిక సంసిద్ధత స్థాయిలను నొక్కి చెప్పారు. ముఖ్యంగా ఈ ఉపన్యాసం, అధ్యాపకులకు స్థిరమైన శక్తి నిల్వ సాంకేతికతలపై విలువైన అంతర్దృష్టులను అందించింది. భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వంతో కలిసి గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బీ.వీ.ఆర్. టాటా గౌరవ అతిథిని సత్కరించారు. ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.ఎం. స్వరూప్ రాజు సమన్వయం చేశారు. పలువురు భౌతిక, రసాయన, గణిత శాస్త్ర అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో

118 రోజుల హుండీ లెక్కింపు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 7 : అమీన్ పూర్ (బీరంగూడ) జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో 118 రోజుల హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం పరిశీలకులు ఈ.ఓ శ్రీనివాస్ సమక్షంలో చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ ఈవో శశిధర్ గుప్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హుండీ లెక్కింపులో సహకరించారు. హుండీ లెక్కింపులో మొత్తం రూ.10,04,280 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈ.వో శశిధర్ గుప్త తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాలో జమ చేసి, రాబోయే శివరాత్రి మరియు జాతర ఉత్సవాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, భక్తుల సహకారంతో పారదర్శకంగా హుండీ లెక్కింపు నిర్వహించామని చెప్పారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణకు ఈ నిధులను ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు దండు రమేష్, చంద్రశేఖర్, లక్ష్మీకాంత్ రావు, దీపక్ గౌడ్, శ్రీనివాస్ జె, ఎల్లయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై మరింత ఫోకస్ పెంచాలి

- క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యంపై జోనల్ కమిషనర్లు తనిఖీలు చేపట్టాలి
- వెబ్ ఎక్స్ దృశ్య మాధ్యమ సమీక్షలో జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆదేశం



ప్రతిపక్షం, సిటీబ్యూరో, హైదరాబాద్, జనవరి 7: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్యం మరింతగా మెరుగుపరచడానికి జోనల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల పై అదనపు కమిషనర్ లు, జోనల్ కమిషనర్ లు, ఇంజనీరింగ్, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కమిషనర్ వెబ్ ఎక్స్ దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్రనగరంగా గ్రేటర్ హైదరాబాద్ ను తీర్చిదిద్దాలన్నారు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై ఫోకస్ గా సాగుతున్న జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమాలు. డ్రైవ్‌లో భాగంగా ఈనెల 6వ వరకూ అదనంగా 1882 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 670 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాల తరలించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్యం మరింతగా మెరుగుపరచడానికి 300 వార్డులలో చేపట్టిన జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఒక్కో రోజు ఒక్కో అంశంపై ఫోకస్ గా సాగుతున్న జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. తొమ్మిదో రోజైన బుధవారం గ్రీన్ వేస్ట్ తొలగింపు పై ప్రత్యేక దృష్టి పెట్టి క్లీనింగ్ చేపట్టారు. 6వ తేదీ నాటికీ 2005 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 670 నిర్మాణ వ్యర్థాల తరలింపు. తొలిరోజు ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ తో ప్రారంభమైన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం గడిచిన తొమ్మిది రోజుల్లో ఫ్లై ఓవర్లు ,రోడ్డు పక్కలు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్లు,చెరువులు, నాలాలు,ఫుట్ పాత్‌లు, పార్కులు , నిర్మాణ-కూల్చివేత, ట్రాన్స్ఫార్మ , విద్యుత్ స్తంభాలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లు వద్ద వ్యర్థాలు తొలగింపు, క్లీనింగ్ ,గ్రీన్ వేస్ట్ తొలగింపు చేపట్టారు. జీహెచ్ఎంసీ పరిధి 300 వార్డులలోనీ మొత్తం 1882 ఏరియాలు,పాయింట్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ లు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లు, పార్కు లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టగా, ఇప్పటి వరకు అదనంగా2005 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, 670 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాల తరలింపు చేపట్టారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం అమలును కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్ లు , డిప్యూటీ కమిషనర్ లు ఆకస్మికంగా తనిఖీ చేస్తూ క్షేత్ర స్థాయిలో ప్రభావంతంగా అమలయ్యేలా చూస్తున్నారు.



త్వరలో అందుబాటులోకి రానున్న సబ్ రిజిస్ట్రార్ సేవలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 7 : సంక్రాంతి పర్వదినం అనంతరం పటాన్ చెరు కేంద్రంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్న పాత తహసిల్దార్ కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ వల్లి సుబ్బలక్ష్మి తో కలసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. శాశ్వత భవనం నిర్మించే వరకు తాత్కాలికంగా ఈ భవనంలోనే కార్యాలయం కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు సమకూరుస్తున్నామని తెలిపారు. శాశ్వత భవనం ఏర్పాటు కోసం అతి త్వరలో భూ కేటాయింపులు జరగనున్నాయని తెలిపారు. స్థల పరిశీలనలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఐదు ఎకరాల సువిశాల విస్తీర్ణంలో శాశ్వత భవనం నిర్మిస్తామని తెలిపారు. జనవరి 20వ తేదీ లోపు కార్యాలయం సేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సబ్ రిజిస్ట్రార్ సురేందర్, పంచాయతీరాజ్ డిఇ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల భూఆక్రమణలకు చెక్

- రాఘవేంద్ర సొసైటీ పేరిట ఫేక్ డాక్యుమెంట్లతో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు
- కోర్టు ఆదేశాలతో 16 ఎకరాల భూమి స్వాధీనం
- అందులో కట్టిన 12 ఇండ్లు కూల్చివేత
- నిందితులపై 6 కేసులు నమోదు



ఫేక్ సొసైటీ క్రియేట్ చేసిన నిందితులు

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 7 : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో భూకబ్జాదారుల అక్రమాలకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. చట్టబద్ధ యజమానులు డి. సురేష్ రెడ్డి, శ్రీనివాస రాజులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న అన్యాయానికి న్యాయస్థానాల ద్వారా ఊరట లభించింది. వివరాల్లోకి వెళ్తే.. మొయినాబాద్ మున్సిపాలిటీ పెద్దమంగళారం రెవెన్యూలోని సర్వే నెంబర్లు 210,211,212 లలో 16ఎకరాల భూమిని రాఘవేంద్ర కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (ప్రెసిడెంట్ జయరామి రెడ్డి) , 1987,88,89లో కొనుగోలు చేసింది. 1998లో హైదరాబాద్కు చెందిన సురేశ్ రెడ్డి, శ్రీనివాస్ రాజులకు అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసింది. కొంత అమౌంట్ ఇచ్చిన వాళ్లు మిగితా దాని కోసం గడువు పెట్టారు. అయితే ఎంతకు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో సురేష్ రెడ్డి, శ్రీనివాస్ రాజు 2005లో కోర్టుకు వెళ్లారు. విచారణ చేపట్టిన కోర్టు 2007లో అగ్రిమెంట్ హోల్డర్లకు అనుకూలంగా డిక్రీ ఇచ్చింది. మిగితా డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు 2011లో రిజిస్ట్రేషన్ కూడా అయిపోయింది. అయితే వీళ్లు విదేశాల్లో ఉండడంతో హరికిరణ్, హర్షవర్ధన్ అనే వ్యక్తులు రాఘవేంద్ర కో ఆపరేటివ్ సొసైటీగా ఫేక్ సంస్థను క్రియేట్ చేసి సంతోష్ నాయక్ అనే మధ్యవర్తి ద్వారా గిరిజనులకు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి 12 ప్లాట్లు విక్రయించారు. దీంతో వాళ్లు ఇండ్లు, రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. 111 జీవో కావడంతో మున్సిపల్ అధికారులు పలుమార్లు నోటీసులు పంపినా వాళ్లు స్పందించలేదు. ఈ నేపథ్యంలో అసలు ఓనర్లు హైకోర్టును ఆశ్రయించగా, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్, హెచ్ ఎండీఏ అధికారులు సర్వే నిర్వహించి 111 జీఓ భూమిలో అక్రమంగా నిర్మించిన 12 ప్లాట్లు, షెడ్లు ఉన్నట్టు నిర్ధారించారు. కోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 30, 2025న పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చివేశారు. ప్లాట్లకు చుట్టూ ఉన్న ప్రహరీలు తొలగించారు. కాగా, ఈ ప్లాట్లు, ఇండ్లపై మధ్యవర్తులే లోన్ తీసుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత మళ్లీ ఈ సంవత్సరం హైకోర్టులో ప్రభుత్వం, ఆర్డీవో, తహసీల్దార్, సురేష్రెడ్డి, శ్రీనివాస్ రాజును పార్టీలుగా చేస్తూ పిటిషన్ కూడా వేయడం గమనార్హం.

నిందితులపై 6 కేసులు

భూ కబ్జాలు, బెదిరింపులు, దాడుల ఆరోపణలతో రాఘవేంద్ర సొసైటీ అధ్యక్షుడు, కార్యదర్శి సహా ఇతరులపై మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కేసు నెం. 367/2019 - IPC 447, 427, 506 (భూ ఆక్రమణ, బెదిరింపులు), కేసు నెం. 560/2021 - IPC 447, 427 (అక్రమ ప్రవేశం, నష్టం), కేసు నెం. 73/2024 - IPC 447, 427, 504, 506 r/w 34, కేసు నెం. 552/2024 - BNS సెక్షన్ల కింద దాడి, బెదిరింపుల కేసు, కేసు నెం. 52/2025 - BNSతో పాటు SC/ST (అట్రాసిటీ) చట్టం కింద కేసు, కేసు నెం. 788/2025 BNS సెక్షన్ల కింద మరో కేసు నమోదైంది.

పత్రాలుంటే తీసుకురమ్మంటున్నాం: న్యాయవాది రాజేష్

ఇండ్ల నిర్మాణ సమయంలోనే అధికారులు నోటీసులు పంపించినా గిరిజనులు స్పందించలేదని భూ యజమానుల తరఫు న్యాయవాది రాజేష్ తెలిపారు. వాళ్ల దగ్గర ఏమన్నా పత్రాలు ఉంటే తమ వద్దకు రావాలని కోరారు. అవకాశం ఉంటే వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఈ ఇష్యూతో ఏ పార్టీ నాయకులకు సంబంధం లేదని, అనవసరంగా ప్రభుత్వ పెద్దలను ఇందులోకి లాగుతున్నారని మండిపడ్డారు. కొందరు కిరాయి మనుషులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.



2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 7 : భారతి నగర్ 111, డివిజన్ పరిధిలోని ఎం.ఐ.జి కాలనీలో గల సీనియర్ సిటిజన్స్ భవన్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ & రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా వెనుకబడిన సుమారు 241 భెల్ రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. సీనియర్ సిటిజన్స్‌కు ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ భవన్ సమీపంలో కల్వర్ట్, సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కొత్త ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ ఎ.ఈ భాస్కర్ హాజరయ్యారు. ప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు వైకుంఠ రావు, జనరల్ సెక్రటరీ రామ రావు, వెంకట్ రెడ్డి, దేవేంద్ర చారీ, రాధాకృష్ణ, మోహన్, బ్రహ్మయ్య, రాజు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నో ఏళ్ల కష్టానికి ముస్తాఫిజుర్‌కి ఐపీఎల్ కాంట్రాక్టు దక్కింది. ఇలా తప్పించడంతో ఎక్కువగా నష్టం జరిగేది అతడికే. పాలిటిక్స్ క్రికెట్‌ను ప్రమాదంలో పడేస్తున్నాయి. దీనికి పరిష్కారం చూపాలి. ఇలాంటి సమస్యలపై ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ బోర్డులు ఎందుకు మాట్లాడవు. ఐసీసీని ఎవరు కంట్రోల్ చేస్తున్నారో అందరికీ తెలుసు.

- ఇంగ్లండ్ క్రికెటర్ మొయిన్ అలీ



బ్రెయిలీ లిపి అంధుల పాలిట వరం

- కేక్ కట్ చేసి లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి7 : బ్రెయిలీ లిపి ఆవిష్కరణ అంధుల పాలిట వరమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. డా.లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని హేమ భార్గవి, జిల్లాలోని అందులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. బ్రెయిలీ లిపి ఆవిష్కరణ అంధుల పాలిట వరమని కొనియాడారు. విద్య ద్వారా దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఈ లిపి మార్గదర్శకమని, దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. అదరపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు ప్రధానంగా అంధులు ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , అదనపు ఎస్పీ మహేందర్ కొంత మంది అంధులను సన్మానించారు.ఈ కార్యక్రమం లో అంద ఉద్యోగులు,సంఘం అధ్యక్ష కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 7: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నానని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముప్పై నాలుగు మంది జర్నలిస్టులకు డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్ట్ బాధలు తనకు తెలుసునని, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేనున్నానని భరోసానిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ముందుగా ఎమ్మెల్యే కలెక్టరేట్ వద్ద ఓ కార్యక్రమంలో పాల్గొన్న విషయం తెలుసుకున్న జర్నలిస్టులు కలెక్టరేట్ వద్దకు వెళ్లి భారీ బైక్ ర్యాలీతో క్యాంప్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఆ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా



నిలిచింది.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరేష్ గౌడ్, ఎలెక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు బొందుగుల నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 7: ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభం కానున్న శ్రీ కూడవెళ్ళి జాతర ఏర్పాట్లపై రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను ఛైర్మెన్ బక్కి వెంకటయ్య తో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఆధ్యాత్మిక మహోత్సవం కూడవెల్లి రామలింగేశ్వర స్వామి జాతర అన్నారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని తెలిపారు. అలాగే ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు, ప్రథమ చికిత్స కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.అనంతరం దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉషయ్య గారి రాజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు,ఆలయ ప్రధాన అర్చకులు సాంకేత్ శర్మ సంబంధిత శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ గూటికి కొత్తపేట గ్రామ సర్పంచ్

ప్రతిపక్షం, గజ్వేల్(జగదేవ్‌పూర్), జనవరి 7: మండలంలోని కొత్తపేట స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన తుమ్మల మహేష్ బుధవారం గజ్వేల్ లోనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారితోపాటు వార్డ్ మెంబర్లు ఆంజనేయులు, మైపాల్, కర్ణాకర్, మహేష్, రాజు , వేణు, వెంకట్ స్వామి తదితరులకు ప్రతాప్ రెడ్డి గులాబీ కండువా వేసి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండా రంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు బట్టు సుధాకర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, ఇటిక్యాల గ్రామ మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్తా, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, జగదేవపూర్ మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగరాజు సీనియర్ నాయకులు ఆకుల దేవేందర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి,ఆదాయం

- సిద్దిపేట నియోజకవర్గ రైతులతో కాన్ఫరెన్స్ లో మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 7: అయిల్ ఫామ్ సాగుతో రైతులకు అధిక దిగుబడి, అధిక ఆదాయం లభిస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మూడు సంవత్సరాలు దాటిన అయిల్ ఫామ్ సాగు రైతులతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయిల్ ఫెడ్ అధికారులు, రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాల్లో అయిల్ ఫామ్ సాగుకు మంచి దిగుబడి రావడం శుభసూచకమని హరీష్ రావు పేర్కొన్నారు. మొదట్లో అయిల్ ఫామ్ సాగుపై రైతుల్లో భయం, అనుమానం ఉండేదని, కానీ ఇప్పుడు మంచి ఫలితాలు రావడంతో చాలా మంది రైతులు ముందుకు వచ్చి ఈ సాగును చేపడుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గంలోని నర్మేట ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పూర్తిదశకు చేరుకుందని తెలిపారు. ఇక్కడే రిఫైనరీ ఏర్పాటు చేసి, నాణ్యమైన వంటనూనెను “సిద్దిపేట బ్రాండ్” పేరుతో ప్యాకింగ్ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఇక్కడే నూనె



తయారైతే రైతులకు మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయిల్ దిగుమతుల పై 50 శాతం సుంకాన్ని తగ్గించడంతో రైతులకు గెల ధరపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సుంకం తగ్గడం వల్ల ఒక్కో గెలపై రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు నష్టం వాటిల్లుతోందని, రైతులకు సరైన ధర రావడం లేదని అన్నారు. అయిల్ ఫామ్ తోటలలో ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మూడు సంవత్సరాలు దాటిన రైతులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి మొక్కకు యూరియా 650 గ్రాములు,సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 1000 గ్రాములు,పొటాష్ 500 గ్రాములు తప్పనిసరిగా వేయాలని తెలిపారు.దీని తరువాత 10 రోజులకోసారి ప్రతి మొక్కకు 250 గ్రాముల MgSO ను సంవత్సరానికి రెండు సార్లు,మరొక 10 రోజుల తర్వాత ప్రతి మొక్కకు 50 గ్రాముల బోరాన్‌ను కూడా సంవత్సరానికి రెండు సార్లు వేయాలని సూచించారు.అంతర్ పంటగా కోకో సాగు చేస్తే సంవత్సరానికి సుమారు రూ.80 వేల వరకు అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు తెలిపారు. అయిల్ ఫామ్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఫీల్డ్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండాలని హరీష్‌రావు ఆదేశించారు.



ఖిద్మత్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరిచ్చిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 7: ఖిద్మత్ సొసైటీ 2026నూతన క్యాలెండర్ ను బుధవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి.రోహిత్ రావు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్అధ్యక్షులు గంగాధర్, నాయకులు సయ్యద్ ఆమెర్ మొహియుద్దీన్, మునీర్ మొహియుద్దీన్,సాదత్ అలీ జకి, ఇలియాస్ ఇద్దు, మైసన్ బిన్ అబ్దుల్లా, మన్సూర్, ఒమర్ మోహియుద్దిన్, రషీద్,కిజర్, తదితరులు పాల్గొన్నారు.



ఐటిఐలో 9న అప్రెంటిషిప్ జాబ్ మేళా

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 7: మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 9వ తేదీన అప్రెంటిషిప్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళాలో మహేంద్ర అండ్ మహేంద్ర లిమిటెడ్ ఆటోమోటివ్ డివిజన్ ఇండస్ట్రియల్ అప్రెంటిషిప్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటిఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డిజిల్ మెకానిక్, మోటర్ మెకానిక్, వెల్డర్ మొదలైన ట్రేడ్లలో పాసైన అభ్యర్థులు ఆసక్తిగల నిరుద్యోగులు ఉదయం 10 గంటలకు తమ ఓర్జినల్ సర్టిఫికెట్లు, ఆధార్ ధ్రువ పత్రాలతో ప్రభుత్వ ఐటిఐ కళాశాల కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8500464377 నెంబర్ ను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.



బీసీ డిక్లరేషన్ అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- టీఆర్పీ జిల్లా అధ్యక్షులు బిక్షపతి కురుమ

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని జిల్లా టీఆర్పీ అధ్యక్షులు బిక్షపతి కురుమ డిమాండ్ చేశారు. టీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు బుధవారం గజ్వేల్ ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీల ఓట్లు దండుకొనేందుకే కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలను నోటి మాటలకు పరిమితం చేయకుండా కాంగ్రెస్ ఆచరించి చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్, యువజన విభాగం అధ్యక్షులు పేర్ల కిషన్, యూవజన విభాగం ఉపాధ్యక్షులు మల్కి సంపత్ కుమార్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు సాహిద్ బాబా,మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్వేతా, బాబు, సురేందర్, వెంకటేష్, పారశురాం, శ్రీకాంత్ తది తరులు పాల్గొన్నారు.



విద్య, వైద్యానికి ప్రాధాన్యం


- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్ష ప్రతినిధి, మెదక్, జనవరి7: మెదక్ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని, నియోజకవర్గంలో విద్య వైద్యానికి ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని వర్గాల ప్రజలను అన్ని వర్గాల సంఘాలకు అభివృద్ధి కోసం పాటుపడతానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ అసోసియేషన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి సంగమేశ్వర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఇందుకోసం రామాయంపేట లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణం చేయడం జరుగుతుందని మెదక్ జిల్లా కేంద్రాన్ని 80 కోట్ల 24 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఏడుపాయల వన దుర్గ మాత ఆలయాన్నికి 39 కోట్ల రూపాయలతో, మెదక్ చర్చి లో 28 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. త్వరలో మెడికల్ కాలేజ్ నిర్మాణం సాగుతుందని నియోజకవర్గంలో వైద్య విద్యకు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి సంగమేశ్వర్, నరేష్, జుబేర్, చీకటి, వరప్రసాద్, నయీం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రతి విద్యార్థి మరో ముగ్గురికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

- మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యం
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 7: ప్రతి విద్యార్థి తాను తెలుసుకున్న సైబర్ భద్రతా సమాచారాన్ని కనీసం ముగ్గురు స్నేహితులకు చేరవేయాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. ఎస్.మహేందర్ పిలుపునిచ్చారు. సైబర్ జాగ్రూకత దివస్‌ను పురస్కరించుకొని ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ సైబర్ క్రైమ్ అవగాహన ప్రచారం కింద, ఈ వారపు థీమ్ “మహిళల రక్షణ -పిల్లల సంరక్షణ” ఆధారంగా, విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో బుధవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డేటింగ్ యాప్‌ల ద్వారా జరిగే మోసాలు, సైబర్ బుల్లీయింగ్, సైబర్ స్టాల్కింగ్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ ఫ్రాడ్స్, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి వివిధ రకాల సైబర్ నేరాలపై వీడియోల ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ మోసాలు ఎలా జరుగుతాయో, వాటి వల్ల బాధితులకు కలిగే ఆర్థిక నష్టాలను ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు.మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలు — ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాల్కింగ్, బ్లాక్‌మెయిల్, డిజిటల్ దుర్వినియోగం వంటి అంశాలపై భయం లేకుండా, ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు



చేయాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా తెలియజేశారు. నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన కొద్దీ సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత సైబర్ మోసాలకు సులభంగా బలవుతున్నారని పేర్కొన్నారు. డేటింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని నమ్మకం పొందిన అనంతరం మోసాలకు పాల్పడుతున్న ఘటనలు అధికంగా జరుగుతున్నాయని, అపరిచితులపై వెంటనే నమ్మకం పెట్టుకోవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారం,బ్యాంక్ వివరాలు,ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని,అనుమానాస్పద లింకులు,కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే భయపడకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమయానికి ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సైబర్ నేరాల నివారణపై ప్రతిజ్ఞ చేయించి, సైబర్ మోసాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సైబర్ అవగాహన క్విజ్ పోటీలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్,కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సయ్యద్, సతీష్, సాయి కిరణ్, స్వప్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



అనుమతులు లేనందునే రాయలసీమ లిఫ్ట్‌ను ఎన్జీటీ నిలిపేసింది. రూ.3,528 కోట్లతో దీన్ని చేపట్టారు. రూ.2,500 కోట్లు ఖర్చుచేశారు. అడ్డగోలుగా పనిచేశారు. కాంట్రాక్టరుకే రూ.900 కోట్లిచ్చారు. ముచ్చుమర్రి నుంచి నీటి తరలింపు అవకాశమున్నా దీన్ని చేపట్టారు. ఎన్జీటీ జరిమానా వేసింది. అబద్ధం వందసార్లు చెబితే నిజమైపోదు. తనపై బురదచల్లితే వారికే నష్టం.

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రాంతీయం

ఆత్మాభిమానం పేరుతో కవిత కన్నీళ్ల డ్రామా

- **కేసీఆర్ దోచుకున్న దాంట్లో వాటా ఇవ్వలేదన్నదే అసలు బాధ**
- **రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి**



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 7 : ఆత్మాభిమానం పేరుతో అసెంబ్లీలో ఎమ్మెల్సీ కవిత కన్నీళ్లు పెట్టుకోవడం పూర్తిగా డ్రామా అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ దోచుకున్న సొమ్ములో తనకు వాటా ఇవ్వలేదన్నదే అసలు కారణమని అన్నారు. దర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భగా దర్పల్లి, సిరికొండ, ఇందాలవాయి మండలాలకు చెందిన 200 కుటుంబాలకు రూ.2 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ద్రోహులకు ఆసరా ఇచ్చింది కవిత కదా అని ప్రశ్నించారు. ఎందరో ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు ఆమెకు ఆత్మగౌరవం గుర్తుకు రాలేదా అని నిలదీశారు. తెలంగాణపై రూ.9 లక్షల కోట్ల అప్పుల భారం మోపి, ఫామ్ హౌస్‌ల్లో హాయిగా ఉంటూ, దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన రాహుల్ గాంధీ కుటుంబంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికీ స్వంత ఇల్లు లేని కుటుంబాన్ని పట్టుకుని అహంకారంగా మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేసీఆర్ మరోసారి ఇలాంటి ప్రవర్తన కొనసాగిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు 'స్వశక్తి' పేరుతో వడ్డీ లేని రుణాలు అందించి స్వావలంబన వైపు నడిపిస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ప్రయాణం, దేశ-విదేశాల నుంచి భారీ పెట్టుబడులతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలకు ఓర్వలేక కళ్లు మండుతున్నాయని, బీజేపీ దేశాన్ని అమ్ముకుంటూ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరమని అన్నారు. తెలంగాణను రైజింగ్ తెలంగాణగా, గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రానున్న రోజుల్లో స్థలాలు లేని పేదలకు 75 గజాల స్థలంలో ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం రామడుగు ప్రాజెక్ట్ ఆయకట్టు కింద వరి పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. అలాగే దమ్మన్నపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెండు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, ఇమ్మడి గోపి, దర్పల్లి సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ చెలిమెల మల్లికార్జున్, జనార్ధన్ రెడ్డి, తహసీల్దార్ టి. శాంత, ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు,; నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీ విజయ్‌కుమార్ బదిలీ

- **నూతన సీపీగా సాధన రష్మీ పెరుమాళ్**



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట జనవరి 7: సిద్దిపేట నూతన పోలీసు కమిషనర్‌గా సాధన రష్మీ పెరుమాళ్ నియామకమయ్యారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సీపీ విజయ్‌కుమార్‌ను హైదారబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, హైదరాబాద్ నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న 2019 బ్యాచ్‌కు చెందిన సాధన రష్మీ పెరుమాళ్‌ను నూతన సీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సీపీ విజయ్‌కుమార్‌కు ఇటీవలే డీఐజీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.



మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య పెంచాలని సీపీఐ వినతి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 7: మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న 20 వార్డులను ప్రజల విజ్ఞప్తి మేరకు 35 వార్డులుగా విభజించాలని కోరుతూ బుధవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపాలిటీలో జనాభా పెరుగుదలతో పాటు పట్టణ విస్తరణ అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వార్డుల సంఖ్యను పెంచడం అవసరమని తెలిపారు. అలా చేస్తే ప్రజలకు మెరుగైన పరిపాలన, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ పాల్గొన్నారు.



కస్తూరిబా గాంధీ విద్యాలయం
టీచర్‌పై కలెక్టర్ ఆగ్రహం

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 7: దుబ్బాక పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రాత్రి విద్యార్థులకు అందించిన భోజనంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గదికి వెళ్ళి ఆహార పదార్థాలను తని ఖీ చేశారు. అన్నం, బిర్నీస్ కూర, సాంబారు, ఆలుగడ్డ టమాటా కూరలను పరిశీలించారు. వంట గది పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నందున సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్, డైలీ మిల్స్ రిజిస్టర్ చెక్ చేశారు. చేసిన వంటకి రిజిస్టర్ లో రాసిన వాటికి ఏదైనా సంబంధం ఉందా అని టిచర్ పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం ఆహార పదార్థాలను కొలత ప్రకారం అందించి ప్రతి ఒక్క విద్యార్థికి కడుపు నిండా తినేలా వంట చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. ఏదో మొక్కుబడిగా ఏ కూరగాయలు దొరికితే అది వండుకుంటు రిజిస్టర్ లో మీ ఇష్టానుసారం రాస్తే ఉపేక్షించేది లేదని దీనికి కారణమైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్, డైలీ మిల్స్ రిజిస్టర్ తీసుకుని వెళ్తున్నానని స్పెషల్ ఆఫీసర్, అకౌంటెంట్ కలెక్టరేట్ లో తన వద్దకు వచ్చి రిజిస్టర్ లో మెయింటైన్ గూర్చి వివరించాలని టిచర్ ను ఆదేశించారు. తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించారు. ఆహారం ఎలా ఉంటుంది, రోజు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం అన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారని ఆరా తీశారు. ఒక లక్ష్యం పెట్టుకుని బాగా చదవాలని చదువుతో పాటు ఆహారం బాగా తీసుకోవాలని అప్పుడే దృఢంగా ఉంటారని విద్యార్థులకు తెలిపారు. విద్యాలయం లో సీసీ కెమెరాలు పని తీరును పరిశీలించారు. 24/7 సీసీ కెమెరాలు పనిచేయాలని ఆదేశించారు.




నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 7: నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించిన అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. మందుల కొరత పై డాక్టర్ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సకాలంలో హాజరుకావాలని శ్రీరామ్ సూచించారు. సిబ్బంది విధుల నిర్వహణపై ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది శ్రీనివాస్ రేణుక పాల్గొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో శ్రీరాం సమావేశం అయ్యారు.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

- **పంచాయితీ పన్ను వసూలలో లక్ష్యాలు సాధించాలి**
- **ఈనెల 8 నుంచి 11 వరకు పారిశుద్ధ్యంపై గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్**
- **సర్పంచులకు- వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ పాలనపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహణ.**
- **మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
- **ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కలెక్టర్ కీలక ఆదేశాలు**



ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 7: గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ నందు జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డిఆర్డిఓ పిడి. శ్రీనివాసరావు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ముందుగా గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. మండల అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధి లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధంపై ఈ నెల 8 నుంచి 11 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన గ్రామపంచాయతీ సర్పంచులుగా వార్డు మెంబర్లుగా బాధ్యతలు చేపట్టిన వారికి గ్రామపంచాయతీ చట్టం, గ్రామాల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసిన సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలు ప్రజల నుండి ఆస్తి పన్ను (ఇంటి పన్ను) లైసెన్స్ ఫీజు, బిల్డింగ్ పర్మిషన్ ఫీజు, తైబజార్ ఫీజు వంటివి వసూలు చేయడంలో లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామపంచాయతీ యాక్టుపై నూతన సర్పంచులకు, వార్డు మెంబర్లకు స్పష్టమైన అవగాహన పై పంచాయతీ కార్యదర్శులు గైడ్ చేయాలన్నారు. గ్రామాలలో బాల కార్మికులు, బాల్యవివాహాల, నిర్మూలన ధ్యేయంగా పనిచేయాలన్నారు. మూఢ నమ్మకాలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. కుల ధృవీకరణ పత్రాలు జారీ విషయంలో పారదర్శకత అవసరమని వివరించారు. వికలాంగులకు, విడోలకు పింఛన్ మంజూరు విషయంలో అర్హత గల లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. చాలామంది వికలాంగులు సదరం సర్టిఫికెట్ పొందే విషయంలో ఇబ్బందులకు గురి అవుతున్నారని వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. దారిద్యరేఖకు దిగువన ఉన్న నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకం వేగంగా జరిగే విధంగా చూడాలన్నారు. భర్తను కోల్పోయి విడోగా ఉన్న మహిళలకు భారత ప్రభుత్వం ద్వారా 20,000 ఆర్థిక సహాయం పొందే పథకానికి సంబంధించి నిధులు ఉన్నాయని దీనికి సంబంధించి విడోలకు సహాయం అందించాలన్నారు. గ్రామాలలో శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ చేపడతామని పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాలు పచ్చదనంతో కలకలాడాలంటే మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. గ్రామాలు పారిశుద్ధ్యం పచ్చదనంతో కళకళలాడాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సురక్షిత ఆహారంపై పర్యవేక్షణ కట్టుదిట్టం

- **జిల్లా కలెక్టర్ హైమవతి**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 7: ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలలో పనిచేసే వంట సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం సిబ్బంది, విద్యార్థులకు ఆహార భద్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొంది నిబంధనలు పాటించాలని ఆదేశించారు. తనిఖీల సమయంలో పాలు, నూనెలు తదితర నిత్యావసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌తో వెలుగులు.. కాంగ్రెస్ పాలనలో చీకట్లు

- **మత్స్యకారులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యం?**
- **బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 7: బీఆర్ఎస్ పాలనలో మత్స్యకారుల జీవితాల్లో సంక్షేమం, అభివృద్ధి స్పష్టంగా కనిపించిందని, నేటి కాంగ్రెస్ పాలనలో మాత్రం చీకట్లు తప్ప మరొకటి కనిపించడం లేదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ మండిపడ్డారు. చిన్న కోడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మత్స్యకారుల జీవనాధారమైన చేప పిల్లల విడుదలపై ప్రభుత్వం ఎప్పుడు స్పందిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. వాగ్దానాలకే పరిమితమై మత్స్యకారుల జీవితాలతో చెలగాటమాడటం సరికాదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయక సాగర్, అనంతగిరి రిజర్వాయర్లలో సరైన సమయంలో చేప పిల్లలను వదిలి మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి అప్పటి మంత్రి హరీష్ రావు కృషి చేశారన్నారు. చేప పిల్లల పంపిణీతో పాటు మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలు కూడా అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు చేప పిల్లల పంపిణీ జరగకపోవడంతో రంగనాయక సాగర్, అనంతగిరి ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తముచ్చట్లు మానేసి చేప పిల్లల పంపిణీ ఎప్పుడు చేస్తారో స్పష్టమైన జవాబు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ పనులు
ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాలు**

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 7: సిద్దిపేట జిల్లాలో ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్లు, గ్రామ మహిళా సమాఖ్య భవనాలు, ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్, పాఠశాలల ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. స్థల కొరత ఉన్న గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి తగిన స్థలాలను గుర్తించాలని డీపీఓను ఆదేశించారు. స్థలం ఉన్నప్పటికీ పనులు ప్రారంభం కాని చోట్ల వెంటనే పనులు మొదలు పెట్టి వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వారం పనుల్లో పురోగతి సాధించాలని తెలిపారు. స్థలం లభించని గ్రామాల్లో ఆయా పనులను రద్దు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, జడ్పీ సీఈవో రమేష్, డీపీఓ రవీందర్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ చిరంజీవులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ వృత్తిలో పదవి విరమణ తప్పనిసరి

- **సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్ రెడ్డి**

ప్రతిపక్షం, దౌల్తాబాద్, జనవరి 7: ఉపాధ్యాయ వృత్తిలో ఉద్యోగులకు పదవి విరమణ ప్రతి ఒక్కరికి తప్పనిసరని సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఇందుప్రియల్ జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అఫ్జల్ హుస్సేన్ ఉద్యోగ పదవి విరమణ అభినంద సభకు ముఖ్య అతిథిగా సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ గజ్జల కనకరాజు, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం డిఇఓ మాట్లాడుతూ. ఇందుప్రియల్ జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధించిన పాఠాలతో పాటు అందించిన పలు సూచనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని గుర్తు చేశారు. ప్రైవేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందని అనుభవం కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలల్లో పనిచేస్తున్నారని, ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, షకిల్ పాషా ప్రధానోపాధ్యాయులు కరీమోద్దీన్, వలి అహ్మద్, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ, టి పి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేందర్, మండల బాధ్యులు రాజిరెడ్డి, త్యాగరాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

"



నగరంలో ఆహార కల్తీని ఉపేక్షించేది లేదు. వ్యాపారులనే కాకుండా, కల్తీకి మూలమైన తయారీ కేంద్రాలపై దాడులు చేస్తామని, ప్రత్యేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ పాసీజర్ను రూపొందించి అమలు చేస్తాం.

- సీపీ సజ్జనార్.

ప్రాంతీయం



ఓటరు డ్రాఫ్ట్ రోల్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 7: ఎన్నికల ముసాయిదా జాబితా పై సందేహాలు పరిష్కరించడానికి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిశారు. ముసాయిదా జాబితా పై కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పాల్గొన్నారు. ఓటరు లిస్టులో ఉన్న తప్పులను గుర్తించిన డివిజన్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులను నగర కాంగ్రెస్ తరపున ఫిర్యదు కాపీలను ఈ కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టులో తప్పులను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



అభ్యున్నతికి అంధత్వమనేది అడ్డు కాదు

- సీపీ సాయి చైతన్య

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 7: అందుల అభ్యున్నతికి అంధత్వమనేది అడ్డు కాదని నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అందుల వనరుల కేంద్రం ఆవరణలో అంధుల జీవనజ్యోతి, అక్షర ప్రదాత, బ్రెయిలీ లిపి నిర్మాత డాక్టర్ లూయి బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీ మాట్లాడుతూ బ్రెయిలీ ఒక లిపి కాదని అంధుల ఆశాజ్యోతిగా మహోన్నత మార్గానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అంధులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారిలో ఆత్మవిశ్వాసం కల్పించే దిశగా తన తండ్రి ప్రోత్సాహం ద్వారా లిపిని తయారు చేయడం జరిగిందని తెలిపారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అని పెద్దలు చెప్పడం జరిగిందని కళ్ళులేకున్నప్పటికీ ప్రపంచాన్ని ఏ విధంగా చూడడం అనేది ఆయన ఆలోచన ద్వారా బ్రెయిలీ లిపి లిఖించేందుకు ముందుకు రావడం జరిగిందని చెప్పారు. ఎప్పుడైతే ఎన్ని అడ్డంకులు వచ్చినప్పటికీ దివ్యాంగ విద్యార్థులైనప్పటికీ ఎవరు కూడా నిరాశ నిశ్రుహలకు గురి కాకుండా ఉండేందుకు ఆత్మవిశ్వాసం ధైర్యం ఆశ అనేది కలిగి ఉన్నప్పుడే వారు ఉన్నత స్థాయికి కచ్చితంగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో సీపీ సాయి చైతన్య స్నేహ సొసైటీ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అంద విద్యార్థిని రజిని స్నేహ సొసైటీ పాఠశాలకు రూ.50 వేల విలువైన క్లాస్ రూమ్ బెంచీలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య, స్నేహ సొసైటీ ఉపాధ్యాయ సిబ్బంది, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, స్నేహ సొసైటీ అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, అర్బన్ సిడిపిఓ సౌందర్య, అంద ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయన్న, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఆరోగ్య రాజు 100 నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇలియాజుద్దీన్ పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తం

- డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 7: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా డివిజన్, వార్డు అభ్యర్థుల ఎంపికను అత్యంత పకడ్బందీగా చేపట్టి ప్రతి వార్డులో ముగ్గురు చొప్పున అభ్యర్థుల ప్రతిపాదనలను స్వీకరించి ఒక సర్వే నిర్వహించి సరైన అభ్యర్థులను ఎంపిక చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నట్టు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఆర్మూర్ పట్టణం సి కన్వెన్షన్ హాల్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయి బాబా గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నగేష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఏ బి చిన్నా, మార చంద్రమోహన్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ వారీగా అభ్యర్థుల పేర్లు డీసీసీ, టీపీసీసీ కి పంపిస్తే తుది జాబితాను ప్రకటిస్తుందని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేటర్ల, మున్సిపాల్టీల్లో కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక, విజయం సాధించేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణ, ఎన్నికల నిర్వహణ పైనా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్లు సంజయ్ సింగ్ బబ్లు, పండిత్ పవన్, అయ్యప్ప శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్లు లింగ గౌడ్, మున్నా భాయ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఇస్సాపల్లి సర్పంచ్ విఠం జీవన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ శ్రీనివాస్ , మహమూద్ అలీ, జాంబీ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ సత్యం పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వృద్ధుల ఆశ్రమం సందర్శన, పండ్ల పంపిణీ



ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, జనవరి 7: చిల్డ్రన్ హోం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి పరిధిలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ హోం నిర్మాణ పనులను ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్, పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులను వేములవాడలో నిర్వహించనున్న త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలకు తీసుకువెళ్లాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమాన్ని ఇంచార్జి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ముందుగా ఆవరణ, వసతి గదులు, వంట గది, సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులను విహార యాత్రలకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. పరిశీలనలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యను సామాన్యులకు చేరువ చేయడమే జాతీయ వైద్య కమిషన్ లక్ష్యం మెడికల్ విభాగంలో పీపీపీతో తో నష్టం ఉండదు. రోగులకు ఉచిత/రాయితీతో చికిత్సలు అందుతాయి. ఇప్పటి వరకు పీపీపీ కింద నాన్ ప్రాఫిట్ కంపెనీలకు మాత్రమే అనుమతిచ్చాం. ఇకపై కార్పొరేట్ కంపెనీలకూ లీజుకు ఇచ్చేందుకు కొన్ని సవరణలు చేశాం.

- అభిజాత్ చంద్రకాంత్, జాతీయ వైద్య కమిషన్ చైర్మన్

హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను బీజేపీకి అప్పగించండి

- అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 7: హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను భారతీయ జనతా పార్టీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు చూపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా, మున్సిపాలిటీల్లో బీజేపీ పాలన లేకపోయినా కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు.జమ్మికుంట డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో సింథటిక్ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం అధికారులతో, కళాశాల సిబ్బందితో సమావేశమైన బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ పలు కీలక ప్రకటనలు చేశారు.

జమ్మికుంట స్టేడియానికి రూ.6.5 కోట్లు

జమ్మికుంట డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో సింథటిక్ స్టేడియం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.6.5 కోట్ల నిధులు మంజూరు చేసిందని బండి సంజయ్ వెల్లడిరచారు. గతంలో వచ్చిన ప్రతిపాదనలను కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు అందజేయగా వెంటనే నిధులు విడుదలయ్యాయని తెలిపారు.'కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల్లా కాగితాలకే పరిమితం అయ్యే ప్రభుత్వం మోదీ ప్రభుత్వం కాదు. అతి త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం. అవసరమైతే మరిన్ని నిధులు కూడా తీసుకొస్తాం'' అని ఆయన స్పష్టం చేశారు.

కాలేజీ భూముల కబ్జాలపై ఉక్కుపాదం

డిగ్రీ కాలేజీకి సంబంధించిన కొంత స్థలం కబ్జాకు గురైందన్న ఫిర్యాదులు అందాయని పేర్కొన్న బండి సంజయ్, ప్రభుత్వ భూముల కబ్జాలకు తాను పూర్తిగా వ్యతిరేకమన్నారు. ''ప్రభుత్వమైనా, ప్రైవేట్ అయినా భూముల జోలికి వస్తే ఉక్కుపాదం మోపుతాం. గతంలో కరీంనగర్ లో కబ్జాలపై ఎలా చర్యలు తీసుకున్నారో అందరికీ తెలుసు. జమ్మికుంటలోనూ అలాంటి చర్యలు తప్పవు'' అని హెచ్చరించారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణకు హామీ

జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో చేర్చి కరీంనగర్ తరహాలో ఆధునీకరిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. ''ఎయిర్‌పోర్టు తరహాలో జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం. ఇది నియోజకవర్గానికి గర్వకారణంగా నిలుస్తుంది'' అన్నారు.

నాయిని చెరువు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

జమ్మికుంట మున్సిపాలిటీని బీజేపీకి అప్పగిస్తే నాయిని చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని బండి సంజయ్ తెలిపారు. బోటింగ్ సౌకర్యం, పార్క్, సుందరీకరణతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు.

అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

''మీ వల్లనే నేను ఎంపీగా గెలిచాను. మోదీ గారు నన్ను కేంద్ర మంత్రిని చేశారు. ఈ పదవిని కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికే వినియోగిస్తున్నా. జమ్మికుంట పేరుకే మున్సిపాలిటీగా ఉంది. వర్షాలు వస్తే మునిగిపోయే కాలనీలు ఎన్నో ఉన్నాయి. అభివృద్ధి కావాలంటే జమ్మికుంట మున్సిపాలిటీని బీజేపీకి అప్పగించండి'' అని బండి సంజయ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- కొత్తపల్లి ఇసుక క్వారీ తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 7: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక క్వారీ నిర్వహించాలని, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి పరిధిలోని ఎల్ఎండి రిజర్వాయర్ జలాల నుండి పూడికతీత, పూడిక నుండి ఇసుక వేరు చేసే విధానాన్ని, ఇసుక క్వారీ నిర్వహణను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి పరిశీలించారు. దిగువ మానేరు జలాశయంలో 0.3 టీఎంసీల సామర్థ్యంలో పేరుకుపోయిన పూడికను తొలగించే కార్యక్రమంలో భాగంగా ఈమోట్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పూడకతీత పనులను చేపట్టింది. పూడిక నుండి వచ్చిన ఇసుకను వేరు చేస్తూ టీజీఎండిసి పర్యవేక్షణలో వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్న విధానాన్ని కలెక్టర్, సిపి పరిశీలించారు. రికార్డులు, వే బిల్లులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట పరిమితికి మించి ఇసుక తరలించినా, కేటాయించిన వాహనాలు కాకుండా ఇతర వాహనాలు క్వారీలోకి వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఇసుక కేటాయింపు ఉండాలని, తనిఖీల్లో అక్రమాలు బయటపడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఎండిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ వినయ్ కుమార్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిఈఈ శ్రీనివాస్, ఏఈఈ సంజన, ఏఈ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు

నేడు ప్రగతి స్టేడియంలో చీరల పంపిణీ

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 7: మంచిర్యాల కార్పొరేట్ పరిధిలో గల నస్పూర్ లోని మూడో వార్డు నుండి మొదలుకొని 17 వార్డు మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కలదు కొక్కిరాల రఘునాథ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆయన సతీమణి మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీరాంపూర్ లోని ప్రగతి స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .



బెదిరింపులకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- వారి వద్ద 9ఎంఎం పిస్టల్, 5 రౌండ్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేష్ బి గితే

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, జనవరి 7: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన తోకల శ్రీకాంత్,దాసరి తిరుపతి, పయ్యలపు గోవర్ధన్ ,జగిత్యాల జిల్లాకు చెందిన మంజరి సురేందర్, అనే నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి జనశక్తి కార్యకలాపాల పేరుతో బెదిరింపులకు గురి చేయడం, డబ్బు వసూలు చేయడం, భూ వివాదాలలో జోక్యం చేసుకోవడం లాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనడానికి ప్రయత్నిస్తున్నరన్న సమాచారంతో అరెస్టు చేశారు. తంగళ్లపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అపి తనిఖీ చేయగా వీరి వద్ద ఒక 9 ఎంఎం పిస్టల్, 5 రౌండ్స్ ఉండగా వాటిని స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలను బెదిరించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ వెంట సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, ఎస్.ఐ ఉపేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.



వీబీ జీ రామ్ జీ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకత తగదు

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 7: కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ పేద ప్రజల ఆదుకోవాలని సదుద్దేశంతో ప్రవేశపెట్టిన వీబీ జీ రాంజీ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేస్తూ ఆమోదించకపోవడం సరికాదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి రవీందర్రావు అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయనఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉపాధి కల్పించి వారికి మరింత ఆర్థిక ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశం తో మోదీ గారు తీసుకువచ్చిన వి బి జి రామ్ జి బిల్లును కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించడం సిగ్గు చేటు అని అన్నారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు బిల్లు పై అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజల్లో తప్పుడు అపోహాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ గారు పేరు కంటే ముందు నెహ్రూ పేరు ఉండేదని మరి ఆ పేరును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మార్చిందని ప్రశ్నించారు. ఈ వీబీ జీ రామ్ జి బిల్లు వికసిత్ భారత్ లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించి వారికి గతంలో ఉన్న 100 రోజులు ఉన్న పని దినాలను 125 రోజులు వారికి మరింత ఆర్థిక లబ్ది చేకూర్చే విధంగా ఈ బిల్లు రూపొందించారు అని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఈ బిల్లు పై తప్పుడు ఆరోపణలు మానేయాలని హితువు పలికారు. ప్రజలు ఎవరు కూడా ఈ బిల్లు పై ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ భారత దేశాన్ని ప్రపంచంలోనే నంబర్ 1 దేశంగా చేయడానికి పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి రాము, వెరబెల్లి రవీందర్ రావు, ముత్తె సత్తన్న, జోగుల శ్రీదేవి, కమలాకర్ రావు, బియ్యాల సతీష్ రావు, మోటపలుకుల తిరుపతి, మాధవరపు వెంకట రమణ రావు, రాపర్తి వెంకటేశ్వర్లు, అమిరిశెట్టి రాజ్ కుమార్, సత్రం రమేష్, రంగ శ్రీశైలం, గడ్డం స్వామి రెడ్డి, వీరమల్ల హరి గోపాల్, బేతు రవి, గోపతి రాజయ్య, కరుకూరి మధుకర్, మిట్టపల్లి మొగిలి, కృష్ణ దేవరాయలు, బుద్దారపు రాజమౌళి మరియు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే వైజ్ఞానిక ప్రదర్శనలు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 7: రాష్ట్రంలోని విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన 53వ రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. 53వ రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన - ఇన్స్పైర్ ప్రాజెక్ట్ ప్రదర్శనకు కామారెడ్డి పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఎంపీ సురేష్ షట్కర్, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను ప్రశంసించిన అతిథులు, భవిష్యత్ దేశ నిర్మాణంలో శాస్త్ర సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే ఆవిష్కరణలు, పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.బాల వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తాయన్నారు. చిన్న వయసులోనే శాస్త్రీయ ఆలోచన అలవడితే భవిష్యత్‌లో వారు గొప్ప శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలుగా ఎదుగుతారన్నారు.నేడు విద్యార్థులు రూపొందిస్తున్న ఈ నమూనాలు రేపటి దేశాభివృద్ధికి పునాదులుగా మారతాయన్నారు. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధనం వంటి అంశాలపై విద్యార్థులు చూపుతున్న ఆసక్తి అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి, పరిశోధనలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తూనే ఉంటుంది" అని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ సుస్థిరత అంశంలో ఆధునిక సాగు పద్ధతులు, నీటి పొదుపు సాంకేతికతలను ప్రదర్శించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ - ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు అంశంలో పర్యావరణానికి హాని కలగని పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే హరిత ఇంధనంపై సౌర, గాలి విద్యుత్ నమూనాలు, శాస్త్ర సాంకేతికతలో నూతన పోకడలు, గణిత నమూనాలు, ఆరోగ్యం మరియు పరిశుభ్రత, నేటి పర్యావరణ పరిరక్షణ నిర్వహణ వంటి అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకుండా దేశం ముందుకు సాగదన్నారు. ఇన్స్పైర్ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం పెంపొందించడం శుభ పరిణామని, గ్రామ స్థాయిలో పుట్టిన అబ్దుల్ కలాం ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ..జీవితంలో గొప్ప విజయాలు సాధించాలని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, శాస్త్ర పరిశోధన రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పండ్లరాజు, మాజీ ఎంపీపీ నర్సింగరావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ మరియు కాంగ్రెస్ నాయకులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, శాస్త్ర నిపుణులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వ వీక్షణం

ట్రంప్ ముందు చేతులు కట్టుకుంటారా?

- మీరెక్కడ..? అమెరికా బెదిరింపులకు భయపడని ఇందిరాగాంధీ ఎక్కడ?
- మోడీపై తీవ్రస్థాయిలో మండిపడ్డ రాహుల్‌గాంధీ



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 7: ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవడానికి ''సార్, ప్లీజ్ నేను మిమ్మల్ని చూడొచ్చా?'' అని బతిమాలుకున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ''తేడా గమనించండి సార్ జీ!'' అంటూ మోదీపై సెటైర్లు వేశారు. అప్పట్లో అమెరికా బెదిరింపులకు ఏమాత్రం భయపడని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎక్కడ? నేడు అమెరికా అధ్యక్షుడి ముందు చేతులు కట్టుకు నిల్చున్న నరేంద్ర మోదీ ఎక్కడ? అంటూ రాహుల్ ఫైర్‌అయ్యారు. ఈ మేరకు ఆయన ఒక పాత వీడియోను షేర్ చేసి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అసలు ఈ వివాదానికి కారణం మంగళవారం ట్రంప్ చేసిన వ్యాఖ్యలే. హౌస్ జీఓపీ రిట్రీట్ లో ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌పై, మోదీపై సంచలన కామెంట్స్ చేశారు. ''భారత్, రష్యా నుంచి ఆయిల్ కొంటోంది. అందుకే మేం వారిపై భారీగా పన్నులు వేశాం. ఆ పన్నుల వల్ల ప్రధాని మోదీ నాపై అంత సంతోషంగా లేరు'' అని ట్రంప్ అన్నారు. అంతటితో ఆగకుండా, ''మోదీ నన్ను చూడటానికి వచ్చారు. ''సార్, నేను మిమ్మల్ని కలవొచ్చా ప్లీజ్'' అని అడిగారు. నేను సరే అన్నాను'' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఒక దేశ ప్రధానిని ట్రంప్ ఇలా చులకన చేసి మాట్లాడటం ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది. రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ 1971 నాటి పరిస్థితులను గుర్తుచేశారు. గతంలో తాను మాట్లాడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన పోస్ట్ చేశారు. "1971 యుద్ధ సమయంలో అమెరికా మనల్ని తీవ్రంగా బెదిరించింది. ఏకంగా తన 7వ నౌకాదళాన్ని భారత్‌పైకి పంపింది. అయినా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా ఒత్తిడికి తలొగ్గలేదు. కొంచెం కూడా భయపడలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి ఏంటి? ట్రంప్ ఒక్క మాట అనగానే మోదీ వణికిపోయారు. లొంగిపోయారు. ఇందిరమ్మ ధైర్యానికి, ఇప్పటి మోదీ భయానికి ఉన్న తేడా ఇదే" అని రాహుల్ ఆ వీడియోలో పేర్కొన్నారు.



నెతన్యాహూకు మోడీ ఫోన్..

- ఇరుదేశాల సంబంధాల బలోపేతంపై చర్చ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 7: భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు బుధవారం ఫోన్ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని మోదీ ఎక్స్ లో వెల్లడించారు. 'స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాను. ఇరుదేశాల సంబంధాలను ఈ ఏడాది మరింత బలోపేతం చేయడంపై చర్చించాం. ప్రాంతీయ పరిస్థితుల గురించి చర్చించాం. తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని కచ్చితమైన నిర్ణయంతో ఉన్నాం' అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక సంబంధాలు, వివిధ అంశాల్లో సహకారం, ప్రగతిపై ఇరు దేశాల ప్రధానులు హర్షం వ్యక్తం చేశారు. రక్షణ, భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేయడం, తీవ్రవాదాన్ని అణచివేయడం వంటి అంశాలపై మాట్లాడారు. అలాగే మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని తాజా పరిస్థితులపై చర్చించారు. శాంతి, స్థిరత్వం కోసం పాటుపడాలని నిర్ణయించారు. గత నెలలోనే నెతన్యాహు.. మోదీకి ఫోన్ చేశారు. గాజాతో కాల్పులు విరమణ అంశంపై చర్చించారు. నెతన్యాహు గత నెలలోనే ఇండియాలో పర్యటించాల్సి ఉంది. అయితే, వివిధ కారణాలో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల ప్రధానులు పలు అంశాలపై చర్చించడం ఆసక్తికరంగా మారింది.



నోటి పూత.. నోటి పుండ్లు

ఇబ్బందిపెడుతున్నాయా?.. కారణాలు, లక్షణాలు మరియు చికిత్స ఏంటి?

మనం తీసుకునే ఆహారంలో పోషకాలు తగ్గిపోతే రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందులో నోటిపూత కూడా ఒకటి. శరీరంలో వేడి ఎక్కువవడం, అధిక ఒత్తిడికి గురవడం, డీహైడ్రేషన్.. వంటివన్నీ ఇందుకు కారణాలే! నోట్లో పుండ్లు అనేవి సహజంగానే చాలా మందికి వస్తుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. ఇవి కొందరికి పెదవులపై వస్తే కొందరికి లోపలి వైపు వస్తాయి. కొం దరికి నోట్లో నాలుకపై, నాలుక చుట్టూ లేదా కింద భాగంలో కూడా వస్తాయి. కొందరికి చిగుళ్ల వాపులు కూడా వస్తాయి. రక్తస్రావం కూడా జరుగుతుంది. ఏం తినాలన్నా, తాగాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయితే నోట్లో పుండ్లు అనేవి అనేక కారణాల వల్ల వస్తుంటాయి. బాగా వేడిగా ఉన్న ఆహారాలను తిన్నప్పుడు లేదా తాగినప్పుడు నోట్లో పుండ్లు ఏర్పడుతాయి.అలాగే టూత్ బ్రష్‌ను బలంగా వాడినా, పడని టూత్ పేస్ట్‌ను వాడినా, పోషకాహార లోపం ఉన్నా, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉన్నా, హార్మోన్ సమస్యల కారణంగా, పలు రకాల మందులను వాడడం వల్ల కూడా నోట్లో పుండ్లు ఏర్పడుతాయి. నోటి పుండ్లు లేదా నోటి పూతలు సాధారణంగా తరుచూ కనిపించినప్పటికీ, కొన్ని అరుదైన సందర్భాలలో సంక్లిష్టమైన ఆటో ఇమ్యూన్ వ్యాధులు మరియు నోటి క్యాన్సర్ వంటి అనేక అంతర్లీన ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి. అందువల్ల వీటి గురించి అవగాహన అనేది చాలా అవసరం..ఇది ఓ తీవ్రమైన అనారోగ్య సమస్యకు ముందస్తు సంకేతంగా సూచిస్తుంది...

జీర్ణ సమస్యలు

నోటి పూతలకు మరొక కారణం జీర్ణవ్యవస్థలోని సమస్యలు. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం, అజీర్ణం వంటి కడుపు సమస్యలు శరీరంలో టాక్సిన్స్ స్థాయిలను పెంచుతాయి. ఇది నోటి పూతల ప్రమాదాన్ని పెంచుతుంది.మీకు జీర్ణ సమస్యలు, తరచుగా నోటి పూతలు వస్తుంటే శరీర అంతర్గత సమతుల్యతలో అంతరాయం కలిగిందనడానికి ఇదొక సూచన.

బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ

నోటి పూతలకు మరొక ప్రధాన కారణం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ. శరీర రోగనిరోధక శక్తి బలహీనపడినప్పుడు శరీర ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడలేకపోతుంది. ఇది నోటిలో బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ సంఘటనను పెంచుతుంది. ఇది అల్సర్లకు దారితీస్తుంది.

ఒత్తిడి, ఆందోళన

ఒత్తిడి, ఆందోళన శరీరంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇవి కూడా నోటి పూతలకు ప్రధాన కారణం కావచ్చు. మనం ఒత్తిడికి గురైనప్పుడు, శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి పెరుగుతుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. ఇంకా, ఒత్తిడి శరీరంలో మంటను పెంచుతుంది. ఇది నోటి పూతలకు దారితీస్తుంది.

అంటు వ్యాధి

కోల్డ్ సోర్స్ (జ్వరపు బొబ్బలు, హెర్పిస్ లబియాలిస్): కోల్డ్ సోర్స్ అనేవి ద్రవంతో నిండిన పొక్కులు, ఇవి సాధారణంగా పెదవులపై లేదా నోటిలో చుట్టూ కనిపిస్తాయి, ఇవి అంటువ్యాధుల వల్ల మరియు హెర్పిస్ సింప్లెక్స్ వైరస్ టైప్ 1 (HSV1) వల్ల వస్తాయి. ఇవి ప్రత్యక్ష స్పర్శ ద్వారా వ్యాపిస్తాయి మరియు ఒత్తిడి, జ్వరం, అనారోగ్యం, సూర్యరశ్మికి గురికావడం, చలి వాతావరణం, హార్మోన్ల మార్పులు, అలసట లేదా గాయం ద్వారా కూడా ప్రేరేపించబడతాయి. మీకు తరచుగా బరువు తగ్గుతుంటే, జ్వరం లేదా గొంతు నొప్పి వంటి ఇతర లక్షణాలు కూడా వస్తుంటాయి. కాబట్టి ఇది తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం కావచ్చు. అటువంటి పరిస్థితిలో, వెంటనే మీ వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం.

నోటి క్యాన్సర్ (Oral Cancer) లక్షణాలు:

నయం కాని పుండు: 23 వారాలు దాటినా తగ్గకుండా ఉంటుంది.
గట్టిగా & గరుకుగా: పుండు గట్టిగా లేదా గడ్డలా అనిపించవచ్చు.
రంగు మారడం: ఎర్రటి (Erythroplakia) లేదా తెల్లటి (Leukoplakia) మచ్చలు, పాచెస్.
రక్తస్రావం: పుండు నుండి రక్తస్రావం జరగవచ్చు.
నొప్పి లేకపోవడం: మొదట్లో నొప్పి లేకుండా ఉండవచ్చు, కానీ పెరుగుతుంది.
ఇతర లక్షణాలు: చెవి నొప్పి, మింగడంలో ఇబ్బంది, నోరు తెరవడంలో కష్టం, గొంతులో నొప్పి, బరువు తగ్గడం, మెడలో గడ్డలు.



రోగనిరోధక వ్యాధులు (ఆటో ఇమ్యూన్ డిసార్డర్స్)

ఇవి శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పనిచేయకపోయి, నోటితో సహా కణజాలంలో వాపు మరియు నష్టానికి దారితీసే పరిస్థితులు. వీటిలో ఓరల్ లైకెన్ ప్లానస్, పెంఫిగస్ వల్గారిస్ & బుల్లస్ పెమ్ఫిగాయిడ్, ఇన్ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ (IBD), బెహ్సెట్ వ్యాధి, సిస్టమిక్ ల్యూపస్ ఎరిథెమాటసస్ (SLE) మరియు సీలియాక్ వ్యాధి వల్ల రావచ్చు.

చిన్న పిల్లలలో కూడా నోటి అల్సర్లు వస్తాయి?

నోటిలోని సున్నితమైన పొర దెబ్బతిన్నప్పుడు అది పుండుగా మారుతుంది. ఇది బాధాకరంగా ఉన్నప్పటికీ, సాధారణంగా 7 నుండి 10 రోజుల్లో దానంతటదే తగ్గిపోతుంది. వైద్య పరిభాషలో వీటిని క్యాంకర్ సోర్స్ (Canker sores) లేదా అఫ్థస్ అల్సర్స్ (Aphthous ulcers) అని కూడా పిలుస్తారు. ఈ పుండ్లు తెల్లగా, ఎరుపు, పసుపు లేదా బూడిద రంగులో వాచినట్లుగా కనిపించవచ్చు. ''పిల్లల్లో వచ్చే ఏ అల్సర్లు అయినా వాటంతట అవే తగ్గుతాయి. అయితే, నోటిలోని లాలాజలంలోని ఘర్షణ (Friction), ఆమ్ల ఎంజైమ్‌ల కారణంగా నోటి అల్సర్లు తగ్గడానికి కొంచెం సమయం పట్టవచ్చు. పిల్లలలో ఇవి రావడానికి సర్వసాధారణ కారణాలు: వైరల్ ఇన్ఫెక్షన్లు మరియు విటమిన్ల లోపాలు.'' హ్యాండ్, ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ (HFMD) అనేది అల్సర్లకు కారణమయ్యే ఒక సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్ . ఇన్ఫెక్షన్ సమయంలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల నోటి శ్లేష్మ పొర (Mucous membrane) దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా 23 సంవత్సరాల పిల్లల్లో విటమిన్ B2 (రైబోఫ్లేవిన్), విటమిన్ B12 మరియు విటమిన్ C లోపాలు సాధారణంగా కనిపిస్తాయి. "పిల్లలు కొత్త ఆహారం తీసుకోకపోవడం వల్ల (దీన్ని నియోఫోబియా అంటారు) పోషకాహారం కోల్పోయి, ఈ నోటి పుండ్లు వస్తాయి," పిల్లల్లో తరచుగా (Recurrent) అల్సర్లు వస్తుంటే, దానికి పోషకాహార లోపం లేదా ఆర్థోడోంటిక్ (పంటి సమస్యకు) వాడే ఉపకరణాలు కారణం కావచ్చు. అయితే, ఆరు నెలలు లేదా ఒక సంవత్సరంలో 3 నుండి 5 సార్లు అల్సర్లు వస్తుంటే, అది రోగనిరోధక లోపానికి (Immunodeficiency) సంకేతం కావచ్చు కాబట్టి, అంతర్లీన కారణాలను తెలుసుకోవడానికి వెంటనే మీ వ్యక్తిగత పిల్ల వైద్యుని సంప్రదించాలి. ఎన్ హెచ్ ఎస్ నివేదిక ప్రకారం తరచుగా పుండ్లు వస్తే అది విటమిన్ బి 12 లోపానికి సంకేతం కావచ్చు. ఈ విటమిన్ నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి, ఎర్ర రక్త కణాలను తయారు చేయడానికి, ఆహారం నుంచి శక్తిని పొందడానికి అవసరం. ఈ విటమిన్ లోపం ఉన్నవారికి తరచుగా పుండ్లు వస్తాయి.

రక్త పరీక్షలు :

పోషకాహార లోపాలు (ఐరన్, B12, ఫోలేట్, జింక్), వాపు ఉంటే (ESR, CRP), ఆటోఇమ్యూన్ వ్యాధుల కోసం నిర్దిష్ట యాంటీబాడీలు (SLE లూపస్ కోసం ANA), లేదా వైరల్ టైటర్ల కోసం రక్త పరీక్షలు చెయ్యాలసి వస్తుంది...



డా. కౌశల్ గోవర్ధన
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా. ధనుంజయ
నర్సింగ్ హోమ్
7702417779

కొన్ని చిట్కాలు

ఉప్పు నీటిని నోట్లో పోసుకుని పుక్కిలించడం వల్ల నోట్లో ఉన్న పుండ్ల సమస్య నుంచి బయట పడవచ్చు. ఉప్పు నీటిలో యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. దీంతో నోట్లోని పుండ్లు నయమవుతాయి. 1 టీస్పూన్ ఉప్పును ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో వేసి బాగా కలిపి ఆ నీళ్లను నోట్లో పోసుకుని 30 సెకన్ల నుంచి 1 నిమిషం పాటు బాగా పుక్కిలించాలి. ఇలా రోజుకు 3 నుంచి 4 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. తేనెలో సహజసిద్ధమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో పుండ్లను తగ్గిస్తాయి. నోట్లో ఉండే నొప్పి నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. తేనెను కొద్దిగా తీసుకుని నోట్లో పుండ్లు ఉన్న చోట నేరుగా రాయవచ్చు. ఇలా రోజుకు 2 నుంచి 3 సార్లు చేస్తుండాలి. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి.

నివారణ

నోటిపూత వచ్చినవారు నెయ్యి, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. బాగా మసాలా ఉన్న ఆహారాన్ని తినకూడదు. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. మాంసాహారం తినడాన్ని తగ్గించాలి. కారం, పులుపు, ఉప్పు ఎక్కువగా ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలి. భోజనం చేసిన ప్రతిసారీ నోటిని కడుక్కోవాలి. బియ్యం ఎక్కువ కడగకుండా వండిన అన్నం తినాలి. నోటి పూతతో బాధపడేవారు నోట్లో పుండ్లు వచ్చిన చోట నెయ్యి రాస్తే సమస్య తగ్గుతుంది. క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.ఇక గ్లిజరిన్ వల్ల కూడా నోటి పూత త్వరగా తగ్గుతుంది. అన్నిటికంటే పౌష్టిక ఆహారాన్ని తీసుకునే వారికి నోటి పూత సమస్య రాదు కాబట్టి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడంపై ముందుగా ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.
సరైన కారణం తెలుసుకుని, సరైన చికిత్స తీసుకోవడానికి తప్పనిసరిగా మీ వ్యక్తిగత వైద్యుని లేదా దంత వైద్యుడిని సంప్రదించండి..

భారతీయ విద్యార్థులకు అమెరికా వార్నింగ్

- నిబంధనలు అతిక్రమిస్తే పంపించేస్తామంటూ హెచ్చరిక

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 7: స్టూడెంట్ వీసాల విషయంలో భారతీయ విద్యార్థులకు అమెరికన్ ఎంబసీ కీలక హెచ్చరిక జారీ చేసింది. వీసాలు హక్కు కాదని, అది ఒక ప్రత్యేక గౌరవం మాత్రమే అని తెలిపింది. స్టూడెంట్ వీసాలపై వెళ్లిన విద్యార్థులు అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. నిబంధనలు పాటించకపోతే.. వీసాల రద్దు, స్వదేశాలకు తరలింపు, కొంతకాలం వరకు బ్లాక్ లిస్టులో పెట్టడం, అరెస్టు చేయడం వంటి చర్యలుంటాయని తెలిపింది. భవిష్యత్తులో అమెరికాకు రాకుండా నిషేధం కూడా విధిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. భారతీయ విద్యార్థులు సహా విదేశీయులు స్థానిక చట్టాలను గౌరవించాలని సూచించింది. ఇటీవల అమెరికా స్టూడెంట్ వీసాల్ని కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అలాగే వర్కింగ్ వీసాలు, టూరిస్ట్, బిజినెస్ వీసాల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తోంది. అన్ని విభాగాల్లోనూ కొత్త వీసాల మంజూరులో కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత ఈ మార్పులు చోటు చేసుకున్నాయి. నిబంధనలు పాటించని వారిని బలవంతంగా స్వదేశాలకు పంపిస్తున్న సంగతి తెలిసిందే.



అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఏఐసీసీ పరిశీలకుల నియామకం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 7: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారంనాడు నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడుపుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమకాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కీ ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. కేరళ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ , కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, కన్హయ్య కుమార్ నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి పరిశీలకులుగా ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మొహమ్మద్ నిజాముద్దీన్ పరిశీలకులుగా ఉంటారు. పశ్చిమబెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్ పరిశీలకులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ వ్యూహాలను అమలు చేయడం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారానికి సమన్వయం చేయడంలో సీనియర్ పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించనున్నారు.



కుక్కలు ఎప్పుడు కరుస్తాయో ఎవరు చెప్పగలరు?

- వీధికుక్కల అంశంపై విచారణలో సుప్రీం అసహనం
- కోళ్లు, మేకల ప్రాణాల మాటేంటని ప్రశ్న

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 7 : వీధి కుక్కల సమస్యపై ప్రస్తుతం విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సుమోటోగా విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే. దేశంలో కుక్క కాటు కేసుల సంఖ్య పెరగుతుండటంపై సుప్రీం కోర్టు బుధవారం ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల సంఖ్య నియంత్రణకు సంబంధించిన నిబంధనల అమలులో అధికార యంత్రాంగం విఫలమైందని వ్యాఖ్యానించింది. జంతు హక్కుల కార్యకర్తల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ప్రస్తుతం వీధి కుక్కలు ఉంటున్న చోటు నుంచి షెల్టర్‌లకు తరలించడం ఈ సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. జనావాసాల మధ్య వీధి కుక్కలను అనుమతించాలా? వద్దా? అన్న అంశం గేటెడ్ కమ్యూనిటీల వెల్ఫేర్ అసోసియేషన్లే నిర్ణయించాలని సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. వీధి కుక్కలు జనావాసాల మధ్య తిరుగాడటాన్ని 90 శాతం మంది స్థానికులు వ్యతిరేకిస్తుంటే 10 శాతం మంది అనుకూలంగా ఉన్నారని చెప్పారు. జంతుప్రేమికులమంటూ రేపటి రోజున జనావాసాల మధ్యకు గేదెలను కూడా తీసుకొస్తారని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సీనియర్ అడ్వకేట్లు కేకే వేణుగోపాల్, కోలిన్ గొన్జాల్వెస్, ఆనంద్ గ్రోవర్, సీయూ సింగ్ తదితరులు కూడా తమ వాదనలు వినిపించారు. అన్ని వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్క కాటు కేసులు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. కుక్కలు ఏ మూడ్‌లో ఉన్నాయో, ఎప్పుడు కరుస్తాయో ఎవరు చెప్పగలరని ప్రశ్నించింది. శునకాల ప్రవర్తన ద్వారా ఏవి ప్రమాదకరమైనవో గుర్తించడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. 'అందరూ శునకాల గురించే మాట్లాడతారు? కోళ్లు, మేకల గురించి ఎవరూ మాట్లాడరు? వాటివి ప్రాణాలు కావా?' అని ప్రశ్నించింది.









మలేషియా ఓపెన్‌లో సింధు శుభారంభం

నాలుగు నెలల స్వల్ప విరామం తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన తెలుగమ్మాయి పీవీ సింధు మలేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు.. 2114, 2220తో సంగ్ షువో యున్ (చైనీస్ తైఫీ)పై గెలిచింది. కాలిగాయం కారణంగా ఆటకు దూరమైన సింధు.. రీఎంట్రీలో ఎలాంటి ఇబ్బందిలేకుండా దూకుడుగా ఆడింది. రెండో రౌండ్‌లో ఆమె ప్రపంచ 9వ ర్యాంకర్ టొమొక మియజకి (జపాన్)తో తలపడనుంది. ఇక పురుషుల డబుల్స్‌లో మాజీ ప్రపంచ నంబర్‌వన్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి.. 2113, 2115తో యాంగ్ పొహువాన్, లీ జెహె (చైనీస్ తైఫీ) జోడీని ఓడించింది. 35 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ప్రత్యర్థిని చిత్తుచేసిన భారత జంట.. క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల, తనీషా క్రాస్టో.. 1521, 2118, 1521తో ప్రెస్లీ స్మిత్, జెన్నీగై (అమెరికా) చేతిలో ఓడారు. మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు.

భారత్‌లోనే ఆడాలి

- లేదంటే పాయింట్లు పోతాయ్
- బంగ్లాదేశ్‌కు స్పష్టం చేసిన ఐసీసీ

టీ20 వరల్డ్‌కప్‌లో తమ మ్యాచ్‌లు భారత్ నుంచి శ్రీలంకకు షిఫ్ట్ చేయాలన్న అభ్యర్థనను ఐసీసీ తోసిపుచ్చింది. ఈ మేరకు మంగళవారం బీసీబీకి ఐసీసీ స్పష్టం చేసింది. షెడ్యూల్ ప్రకారమే భారత్‌లో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని, లేదంటే పాయింట్లు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇటీవల భారత్ బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సంచలన నిర్ణయం తీసుకుంది. భద్రతాపరమైన కారణాలు చూపిస్తూ, తమ జట్టు, భారత్‌లో ఆడాల్సిన వరల్డ్‌కప్ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి లేఖ రాసింది. అయితే ఆ అభ్యర్థననే ఐసీసీ తాజాగా తిరస్కరించినట్లు తెలిసింది. వచ్చే నెలలో భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ తమ గ్రూప్ దశ మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే ఆడాల్సి ఉంది. అయితే ఇటీవల బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు రీసెంట్‌గా కేకేఆర్ జట్టు నుంచి వదిలేయండతో ఇరు దేశాల మధ్య వివాదం ముదిరింది. ఎలాంటి వివరణ లేకుండా తమ దేశ ఆటగాడు ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో బంగ్లా ఈ నిర్ణయం తీసుకుంది. తమ క్రికెట్ జట్టును భారత్‌కు పంపబోమని బంగ్లా క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఈ వివాదాల మధ్యే బంగ్లాదేశ్ ప్రపంచకప్‌నకు తమ జట్టును ప్రకటించింది. 15 మందితో కూడిన బృందం పొట్టి కప్పు టోర్నీలో పాల్గొననున్నట్లు ప్రకటన చేసింది. ఈ జట్టుకు లిట్టన్ దాస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇందులో ముస్తాఫిజుర్ రహమాన్ కూడా చోటు దక్కించుకున్నాడు. ప్రస్తుతం బంగ్లాలో దేశవాళీ టోర్నీ బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ కొనసాగుతోంది. ఈ లీగ్‌లో భారత్‌కు చెందిన రిధిమా పాఠక్ ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే భారత్ బంగ్లాదేశ్ వివాదాల నేపథ్యంలో రిధిమాను కామెంటరీ ప్యానెల్ నుంచి తొలగించారని వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై రిధిమా స్వయంగా క్లారిటీ ఇచ్చారు. తనను తొలగించారని వస్తున్న వార్తలన్నీ అవాస్తవానేనని అన్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో తానే స్వయంగా ప్యానెల్ నుంచి తప్పుకున్నట్లు క్లారిటీ ఇచ్చారు.



సౌతాఫ్రికాను వణికించిన వైభవ్

- క్లీన్ స్వీప్ చేసిన భారత్ అండర్ 19

దక్షిణాఫ్రికా అండర్ 19 జట్టుతో మూడు వన్డేల సిరీస్‌ను యువ భారత్ 30తో క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగిన చివరి వన్డేలో టీమిండియా 233 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. భారత్ ఓపెనర్లు శతకాలతో చెలరేగడంతో సఫారీ జట్టు ముందు భారత్ భారీ టార్గెట్ ఉంచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 393 పరుగులు చేసింది. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ (127) మరోసారి విధ్వంకర ఇన్నింగ్స్ ఆడి సూపర్ సెంచరీ సాధించాడు. అలానే మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ (118) కూడా శతకం బాదాడు. అలానే భారత బ్యాటర్లు వేదాంత్ త్రివేది (34), మహ్మద్ ఎషాన్ (28*), హెనిల్ పటేల్ (19*), అభిజ్ఞాన్ కుందు (21) పరుగులు చేశారు. ఓపెనర్లు వైభవ్, జార్జ్ తొలి వికెట్‌కు 227 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. తాజాగా సెంచరీతో వైభవ్ ఓ వరల్డ్ రికార్డు సృష్టించాడు. యూత్ వన్డే క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్నవయస్కుడైన అండర్19 కెప్టెన్‌గా ఘనత సాధించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఈ ఫీట్ అందుకున్నాడు. ఆయుష్ మాత్రే గైర్హాజరీ కావడంతో వైభవ్ తొలిసారి సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సోని మూడు వికెట్లు సాధించగా.. జాసన్ రౌల్స్ 2, మైఖేల్ క్రూయిస్కాంప్ ఒక వికెట్ తీసుకున్నారు. ఇక భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు.. ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. 35 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. పాల్ జేమ్స్ (41), డేనియల్ బోస్మాన్ (40), కార్న్ బోథా (36*) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. టాప్4 బ్యాటర్లలో ఒక్కరూ కూడా రెండంకెల స్కోరు చేయలేదు. భారత బౌలర్లలో కిషాన్ కుమార్ సింగ్ 3 వికెట్లు తీశాడు. అలానే మహ్మద్ ఎనాన్ 2, హెనిల్ పటేల్, కనిష్క్ చౌహాన్, ఉదవ్ మోహన్, అంబరీష్, వైభవ్ తలో వికెట్ సాధించారు. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డూ అందుకున్నాడు.

నాలుగోరోజు ఆట.. 119 ఆధిక్యంలో ఇంగ్లండ్

యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాఇంగ్లండ్ సిడ్నీ వేదికగా ఐదో టెస్టులో తలపడుతున్నాయి. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 75 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఆసీస్‌పై 119 పరుగుల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇంగ్లండ్ యువ ప్లేయర్ జాకబ్ బెథెల్(142*) టెస్టుల్లో తన తొలి శతకాన్ని నమోదు చేశాడు. బెథెల్‌తో కలిసి హ్యారీ బ్రూక్(42).. 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. డకెట్(42) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లంతా తీవ్రంగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బ్యాటర్లలో క్రాలీ(1), రూట్(6), విల్ జాక్స్(0), జెమీ స్మిత్(26), స్టోక్స్(1), కార్సే(16) ఘోరంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో వెబ్‌స్టర్ 3, బోలాండ్ 2, నీసర్, స్టార్క్ తలో వికెట్ పడగొట్టారు. అంతకుముందు 518/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ జట్టు 133.5 ఓవర్లలో 567 పరుగులకు ఆలౌటైంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 129 పరుగులతో నిలిచిన స్టీవ్ స్మిత్ 138 (220 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) రన్స్ చేసి ఔటయ్యాడు. 48 పరుగులతో క్రీజులోకి వచ్చిన వెబ్‌స్టర్ 71 (87 బంతుల్లో, 7 ఫోర్లు) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిచెల్ స్టార్క్ 5, బోలాండ్ డకౌట్‌గా వెనుదిరిగారు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, జోష్‌టంగ్ తలో 3, బెన్‌స్టోక్స్ 2, విల్ జాక్స్, జాకబ్ బెథెల్ చెరో వికెట్ తీసుకున్నారు.



ప్రతిపక్షం
www.prathipaksham.in
10
హైదరాబాద్
గురువారం
08.01.2026


సినిమా



ఈ సంక్రాంతికి సరదగా గోలగోల చేద్దాం

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రవితేజ

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' జనవరి 13న గ్రాండ్‌గా విడుదల కానుంది. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రం, ఇప్పటికే టీజర్, మొదటి మూడు పాటలతో హ్యూజ్ బజ్‌ను సృష్టించింది. ఈ జోష్ ని కొనసాగిస్తూ, చిత్ర బృందం ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేసింది. ట్రైలర్ రవితేజ యాక్షన్ సినిమాలు చాలు అనే ఆకట్టుకునే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఇది ప్రేక్షకులు చాలా కాలంగా మిస్ అవుతున్న ఫ్యామిలీ జోన్‌కు అతను తిరిగి వస్తున్నాడనే ఫన్ ఇండికేషన్. ఫారిన్ టూర్ లో ఆషిక రంగనాథ్‌పై ప్రేమ కలగడంతో, డింపుల్ హయతితో అతని వైవాహిక జీవితం ఊహించని విధంగా మారడంతో కథ మొదలవుతుంది. ఇద్దరు మహిళల, రెండు విభిన్న ప్రశ్నల మధ్య నలిగిపోతున్న అతని ప్రయాణం హిలేరియస్‌గా, అదే సమయంలో ఎమోషనల్ సాగుతుంది. కుటుంబ కథలను అద్భుతంగా హ్యాండిల్ చేసే డైరెక్టర్ కిశోర్ తిరుమల, ఈసారి తన ట్రేడ్‌మార్క్ ఫ్రెష్ నెస్ తో, హ్యూమర్ ని మరింతగా పెంచాడు. కథను ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా కామెడీ, సినిమాకు లైవ్లీగా ఫీల్‌గుడ్ వైబ్‌ను అందిస్తుంది. చివరి సీక్వెన్స్‌లో రవితేజ ఆత్మే తన క్లిష్ట పరిస్థితిని చూపించే తీరు సినిమాను పర్ఫెక్ట్‌గా హ్యూమర్ టోన్ సెట్ చేసింది. మాస్, యాక్షన్ పాత్రల తర్వాత రవితేజను క్లీన్, ఫ్యామిలీఫ్రెండ్లీ అవతార్‌లో చూడటం ఫ్రెష్ నెస్ కలిగిస్తుంది. స్వాగ్‌కు క్లాస్‌ను కలిపి, అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో ప్రతి సన్నివేశాన్ని ఎలివేట్ చేశారు. అతని యాక్టింగ్ చార్మ్‌తో, నేచురల్ గా అదిరిపోయింది. పొజెసివ్ వైఫ్ పాత్రలో డింపుల్ బలమైన ఇంటెన్సిటీని చూపిస్తే, మోడ్రన్ ఎడ్జ్‌తో వచ్చిన ఆషిక పాత్ర కూడా ప్రత్యేకంగా నిలుస్తుంది. విరుద్ధ స్వభావాలున్న ఈ రెండు పాత్రల్లోనూ హీరోయిన్స్ మెప్పించారు. కామెడీ ఫ్రంట్‌లో సత్య లాఫ్‌రయాట్ మోమెంట్స్‌తో అలరించారు. సునీల్, వెన్నెల కిశోర్ ఫన్ మరింత ఎలివేట్ చేశారు, టెక్నికల్‌గా సినిమా వైబ్రెంట్‌గా, రిచ్‌గా వుంది. ప్రసాద్ మూరెళ్ళ సినిమాటోగ్రఫీ గ్లాసీ, కలర్‌ఫుల్ టెక్చర్‌ను అందించగా, భీమ్స్ సంగీతం హ్యూమర్ ఎమోషన్ ని ఎలివేట్ చేసింది. మొత్తంగా ట్రైలర్ కామెడీ, డ్రామా, ఎమోషన్స్, రిలేటబుల్ రిలేషన్‌షిప్ కన్ఫ్యూజన్స్‌తో, ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్‌లో తప్పకుండా చూడాల్సిన చక్కని ఎంటర్‌టైనర్‌గా హామీ ఇస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో రవితేజ మాట్లాడుతూ.. "ఈసారి పండక్కి సరదా సరదాగా గోల చేద్దాం. ఇదొక్కటే కాదు.. వస్తున్న అన్ని సినిమాలు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్. ఈసారి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంక్రాంతి అవుతుందని నా ప్రగాఢ నమ్మకం" అన్నారు.



'మా ఇంటి బంగారం'

9న టీజర్ ట్రైలర్ విడుదల

సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను జనవరి 9 ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ టీజర్ ట్రైలర్ ప్రేక్షకులకు పవర్ఫుల్, ఇంటెన్స్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుందని వారు పేర్కొన్నారు. సమంతతో ఇది వరకు 'ఓ బేబి' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన డైరెక్టర్ నందినీ రెడ్డి ..మరోసారి ఈ స్టార్ హీరోయిన్‌ను 'మా ఇంటి బంగారం'లో డైరెక్ట్ చేస్తోంది. ఈ హిట్ కాంబోపై భారీ అంచనాలున్నాయి. అయితే ఈసారి మాత్రం డిఫరెంట్ ఎమోషన్స్, స్టోరీతో, బోల్డ్‌గా, గ్రిప్పింగ్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా మా ఇంటి బంగారం సినిమా ఉండబోతోందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రంలో సమంత ప్రధాన పాత్రను పోషిచటంతో పాటు ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే సమంత లుక్ చాలా పవర్‌ఫుల్‌గా, ఎఫెక్టివ్‌గా కనిపించి సోషల్ మీడియాలో మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. ఆమె పాత్రలోని ఇంటెన్సిటీ, పాత్రను తీర్చిదిద్దిన తీరు స్పష్టంగా తెలుస్తోంది. రా, హై ఇంపాక్ట్ యాక్షన్‌తో మన భారతీయ శైలిని మిక్స్ చేసినట్లు సమంత పాత్ర అలరించనుంది. దీంతో ఆమె స్థాయి మరో రేంజ్‌కు చేరుకోనుంది. మరి జనవరి 9న రాబోతోన్న టీజర్ ట్రైలర్ ఎలా ఉండనుందనే ఆసక్తి అందరిలోనూ పెరిగింది. సమంత లీడ్ రోల్ చేస్తోన్న 'మా ఇంటి బంగారం' చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటిస్తుండగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఓం ప్రకాశ్ సినిమాటోగ్రఫీ, సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. కథనం, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌ను వసంత్ మారిన్‌గంటి, రాజ్ నిడిమోరు రచించగా, ప్రముఖ రచయిత సీతా ఆర్ మీనన్ క్రియేటివ్ సూపర్‌విజన్ చేస్తున్నారు.

'సీతా పయనం' నుండి సాంగ్ రిలీజ్



మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతున్న కొత్త సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో నటించగా.. నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్నారు. అతని మేనల్లుడు యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టిన మేకర్స్.. తాజాగా ఈ సినిమా నుంచి అస్సలు సినిమా అనే సాంగ్ రిలీజ్ చేశారు. ఆహా ఓహో అంటాడు.. అందం నీదే అంటాడు అనే పదాలతో మొదలైన ఈ సాంగ్ ఊపుతెప్పించే లిరిక్స్ తో ఆకట్టుకుంటోంది. చంద్రబోస్ లిరిక్స్ అందించిన ఈ పాటను శ్రీయ ఘోషల్ పాడారు. ఈ పాటలో ఐశ్వర్య అర్జున్ అందాలు హైలైట్ అవుతుండగా.. అనూప్ రూబెన్స్ బాణీలు అదుర్స్ అనేలా ఉన్నాయి. విడుదల చేసిన కాసేపట్లోనే ఈ సాంగ్ వైరల్ కావడమే గాక, అన్ని వర్గాల ఆడియన్స్ ని ఆకట్టుకుంటోంది. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది.



నారి నారి నడుమ మురారి ఫుల్ ఫన్ ఎంటర్‌టైనర్

హీరోయిన్ సాక్షి వైద్య

చార్మింగ్‌స్టార్ శర్వా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నటిస్తున్న హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారి నారి నడుమ మురారి'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. జనవరి 14న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సాక్షి వైద్య విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?

ఏజెంట్ సినిమా జరుగుతున్న సమయంలోనే నిర్మాత అనిల్ గారు నాతో మరో సినిమా చేస్తానని చెప్పారు. ఆయన ప్రామిస్ నిలబెట్టుకున్నారు. ఈ సినిమాలో నిత్య క్యారెక్టర్ కోసం అనిల్ గారు, డైరెక్టర్ గారు నన్ను ఫైనల్ చేశారు. నిత్య క్యారెక్టర్, ఈ కథ చాలా నచ్చాయి. ఈ క్యారెక్టర్ నాకు పర్సనల్గా చాలా రిలేట్ అవుతుంది. తను ఇన్నోసెంట్ గా కనిపించే అమ్మాయి. నిజాయితీగా వుంటుంది.

శర్వా తో కలిసి నటించడం ఎలా అనిపించింది?

శర్వాతో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన కామెడీ టైమింగ్ కూడా అద్భుతంగా ఉంటుంది. ఆయనతో కలిసి నటించడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. అందరూ కూడా చాలా మంచి కోస్టార్స్. షూటింగ్ సమయంలో వెన్నెల కిషోర్ గారి పెర్ఫార్మెన్స్ ని చూస్తే చాలా సర్ప్రైజింగ్ అనిపించింది. ఎందుకంటే క్యారెక్టర్ లో ఉన్నప్పుడు ఆయన కంప్లీట్ గా ఒక డిఫరెంట్ పర్సన్ లా కనిపించారు. అలాగే ఇందులో నరేష్‌గారు క్యారెక్టర్ కూడా చాలా బాగుంటుంది. అందరితో కలిసి పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

తెలుగులో నటించేటప్పుడు లాంగ్వేజ్ బ్యారియర్ ఉంటుంది కదా?

తెలుగులో మాట్లాడటం ఒక బ్యారియర్. కాకపోతే డైలాగ్ విషయానికి వచ్చేటప్పటికి ముందుగానే ప్రిపరేషన్ ఉంటుంది. డైరెక్టర్ సాయి గారు టైమింగ్ విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. తగినంత సమయాన్ని ఇచ్చారు చాలా సపోర్ట్ చేశారు. సాయిగారి స్ట్రెంత్ కామెడీ. షూటింగ్ సమయంలో కూడా ఆయన చాలా సరదాగా ఉంటారు. నవ్వుతూనే ఉంటారు. అదే సినిమాలో కూడా కనిపిస్తూ ఉంటుంది.

ఈ క్యారెక్టర్ కోసం ఎలా ప్రిపేర్ అయ్యారు?

ఈ సినిమాలో నాకు చాలా మంచి క్యారెక్టర్ ఉంది. ఈ సినిమా కోసం దాదాపు ఒక నెల రోజులు పాటు వర్క్ షాప్ చేశాం. క్యారెక్టర్ గురించి ప్రతిదీ అర్థం చేసుకున్నాను. ఈ కథ విన్నప్పుడు మీ రియాక్షన్ ఏమిటి? ఈ కథ వినగానే చాలా మంచి కథ చేసే అవకాశం వచ్చిందనిపించింది. కచ్చితంగా ఈ సినిమా చేయాలని వెంటనే సైన్ చేశాను. ఈ సినిమాకి స్టోరీ ఈజ్ కింగ్.

మ్యూజిక్ గురించి ?

ఇందులో మ్యూజిక్ రియల్ లైఫ్ కి చాలా దగ్గరగా ఉంటుంది. చాలా కొత్త ఎక్స్పీరియన్స్ ఇచ్చే పాటలు ఇవి. ఖచ్చితంగా థియేటర్స్ లో ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు.

సంయుక్తతో మీకు కాంబినేషన్ సీన్స్ ఉన్నాయా ?

చాలా మంచి కాంబినేషన్స్ సీన్స్ ఉన్నాయి. తను చాలా స్వీట్ పర్సన్. తను చాలా విషయాల్లో నాకు హెల్ప్ చేసింది. సినిమా షూటింగు చాలా ఫన్ ఫుల్ గా జరిగింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200